


బర్త్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేస్తే..

మరణ ధ్రువీకరణ జారీ

- కూసుమంచి తహసీల్దార్ కార్యాలయంలో ఘటన
- ప్రశ్నించిన బాధితులపై దుర్భాషలాడిన సెక్షన్ అధికారి

వివరాలు : 7లో

కేంద్ర మంత్రులు నిర్మల, జేపీ నడ్డాను

కలిసిన మంత్రి తుమ్మల

పామాయిల్ దిగుమతి సుంకం పెంపు, యూరియా వాటాలపై వినతుల అందజేత





జేపీ నడ్డాకు వినతిపత్రం అందిస్తున్న మంత్రి తుమ్మల, నిర్మలాసీతారామన్‌కు సమస్యను వివరిస్తున్న దృశ్యం

ఖమ్మం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్‌ను, కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఢిల్లీలో కలిశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాకు మంత్రి తుమ్మల హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో కేంద్రమంత్రులను వేర్వేరుగా కలిసి సమస్యలు విన్నవించారు. క్రూడ్ పామాయిల్‌పై 44శాతం దిగుమతి సుంకం పెంచాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌కు విన్నవించారు. క్రూడ్‌పామాయిల్ దిగుమతి సుంకాన్ని మార్చి 2018లో ఉన్నట్లుగా 44శాతానికి పెంచాలని, దిగుమతి సుంకం 16.5 శాతానికి తగ్గించడంతో పామాయిల్ ధర తగ్గడంతో పాటు పామాయిల్ సాగు ప్రోత్సాహానికి అడ్డంకిగా మారిందని వివరించారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరుపున లేఖ అందించారు. ప్రస్తుతం సాగు సీజన్ ప్రారంభం అయినందున రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం పామాయిల్ సాగుకు ప్రోత్సాహం కల్పించేందుకు కేంద్రం కృషిచేయాలని కోరారు. అలాగే మంత్రి జేపీ నడ్డాను కలిసిన ఆయన ఏప్రిల్ నుంచి జూలై నెల వరకు ఏర్పడిన యూరియా లోటును ఈనెల కేటాయింపులతో కలిపి రాష్ట్రానికి సరఫరా చేయాలని వినతిపత్రం అందించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.09 లక్షల మె.ట. యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, సరఫరాలో ఆలస్యమైతే రైతులు ఇబ్బంది పడే అవకాశం ఉందని వివరించారు. ఆగస్టులో 1.70లక్షల మె.ట. యూరియా కేటాయించిందని ఈ యూరియాను తక్షణమే సరఫరా చేయాలని, ఏప్రిల్ నుంచి జూలై వరకు రాష్ట్రానికి రావల్సిన 2.10లక్షల. మె.ట. యూరియా లోటు ఉందని, ఆ కోటాను ఆగస్టు కోటాతో కలిపి పంపించాలని కోరారు. మంత్రి తుమ్మల వెంట భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా ఉన్నారు.



ఎవరు పట్టించుకోరు అనుకున్నారో ఏమో? ఒకరిని మించి మరొకరు.. రోజుల తరబడి విధులకు ఎగనామం పెట్టి ఉన్నతాధికారులకు పంగనామాలు పెట్టారు. తాము విధులు నిర్వర్తించకుండానే దర్జాగా హాజరు వేసేసుకున్నారు. ఇది ఇటీవల కాలంలో రాష్ట్రంలోని పలు పంచాయతీల్లో విధులు నిర్వర్తించాల్సిన కార్యదర్శులు పాల్పడిన అక్రమాలకు నిదర్శనాలు. అయితే ఫేస్ రికగ్నైజేషన్ యాప్‌లో తప్పుడు హాజరు నమోదు చేసిన విషయం వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్నీ జిల్లాల్లోనూ జిల్లాస్థాయి అధికారులు హాజరు తీరును పరిశీలించి చర్యలు చేపడుతూ వస్తున్నారు. అందులో భాగంగా రాష్ట్రంలో ఇప్పటికి సుమారు 17 మంది పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయగా.. జిల్లాలోనూ ఇద్దరు కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు వేశారు. కాగా హాజరుతీరులో అనుమానం ఉన్న మరికొందరు కార్యదర్శులకు సైతం జిల్లా పంచాయతీ శాఖ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు సమాచారం. అయితే జిల్లాలోని మరికొందరు కార్యదర్శులు సైతం ఇదే తరహాలో తప్పుడు హాజరు వేసి అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు వినిపిస్తుండగా.. ఆయా కార్యదర్శులు తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్న వాదన వినిపిస్తోంది.



తప్పుడు హాజరు.. తప్పదు మూల్యం

- ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్.. పలువురికి షోకాజ్‌లు
- ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న సంఘటనలు
- ఇన్‌చార్జ్ కార్యదర్శులు పూర్తిగా విస్మరించారా?
- ఒకే రోజు గంటలోపే రెండు పంచాయతీల్లో హాజరు
- ఆ సమయంలోనే చొక్కాలు సైతం మార్చుకున్నారట



గంట వ్యవధిలో వేర్వేరు పంచాయతీల్లో హాజరు

ఖమ్మం రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా జరిగినట్టుగానే జిల్లాలోని ఖమ్మం రూరల్ మండలంలో కూడా ఓ పంచాయతీ కార్యదర్శి విధులకు హజరుకాకుండానే రెండు నెలలుగా పాత ఫొటోలతోనే తప్పుడు హాజరు వేసుకున్నట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత కార్యదర్శి తాను విధులు నిర్వర్తించే పంచాయతీతోపాటు మరో పంచాయతీకి సైతం ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నాడు. కాగా రెండు పంచాయతీలకు సైతం ఆయన విధులకు హాజరవకుండానే రెండు నెలలకుపైగా అటెండెన్స్ వేసుకున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని కొండాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏడాది కాలంగా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే ఈ పంచాయతీ కార్యదర్శి తాను విధులకు హజరుకాకుండానే పంచాయతీలో పనిచేసే ఓ గుమస్తా ద్వారా హాజరును నమోదు చేయించుకున్నట్టు సమాచారం. తాను ఆరెకోడు గ్రామపంచాయతీకి సైతం ఇన్‌చార్జ్ కార్యదర్శిగా కొనసాగుతుండగా రెండు చోట్ల ఇదేతీరున వ్యవహరించారన్న ఆరోపణలు లేకపోలేదు. పంచాయతీలకు చెందిన ఏదో ఒక ప్రాంతంలో మూడు నాలుగు విధాలుగా ఫొటోలు దిగి వాటిని యాప్‌లో పొందుపరచడం గమనార్హం.

ఇన్‌చార్జ్‌లు ఉన్న చోట ఎక్కువగా..

అయితే జిల్లాలో ఇలా ఇన్‌చార్జ్ కార్యదర్శులున్న చోట ఇలాంటి అవకతవకలు ఎక్కువగా జరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో 23 మందికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్టు సమాచారం కాగా.. ఆయా కార్యదర్శులతోపాటుగా, ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరించిన మిగిలిన కార్యదర్శుల హాజరుతీరును కూడా లోతుగా విచారణ జరిపితే ఇంకొంతమంది బయటపడే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కాగా ఖమ్మం రూరల్ మండలంలోని సదరు కార్యదర్శికి జిల్లా అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు తెలిసింది. అలా రెండు పంచాయతీల్లో విధులు నిర్వర్తించినట్టుగా హాజరు వేసిన సంఘటనల్లో కేవలం 20 నిమిషాల నుంచి గంటల వ్యవధిలోనే హాజరు వేయడం కొసమెరుపు. రెండు పంచాయతీల్లోనే ఉదయం సమయంలో గంటలోపు వ్యత్యాసంలో మాత్రమే హాజరు వేయగా... ఇక ఏ పంచాయతీలో ఎంత సమయం విధులు నిర్వర్తించారనేది ప్రశ్నార్థకం. అంతేకాదు ఆయా సమయంలోనే రెండు పంచాయతీల్లో వేర్వేరు దుస్తులతో విధులకు హాజరైనట్టు ఉండటం శోచనీయం. ఇక రెండు పంచాయతీల్లోనూ ఒకేరకమైన ఫొటోలు ఉండటం గమనార్హం. అసలు విధులకు హాజరుకాలేదన్న ఆరోపణలకు సంబంధిత కార్యదర్శి వేసిన హాజరులో సమయాలోపం మరింత బలం చేకూరుస్తోంది.అయితే జిల్లాలోనూ ఈ వ్యవహారశైలిలో అక్రమాలు పెద్ద ఎత్తున జరిగినట్టు ఆరోపణలు వినిపిస్తుండగా.. అధికారులు మాత్రం వ్యవహారాన్ని బయటకు పొక్కకుండా జాగ్రత్తలు పాటిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

14 రోజులే అలా చేశా...

తప్పుడు హాజరు నమోదుకు సంబంధించి కొండాపురం పంచాయతీ కార్యదర్శి కోటయ్యను ఎఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. తాను నెలల తరబడి అక్రమాలకు పాల్పడలేదని, కేవలం 14 రోజులు మాత్రమే యాప్‌లో తప్పుడు సమాచారంతో హాజరు వేశానన్నారు. అదికూడా ఒక పంచాయతీకి సంబంధించి మాత్రమే చేశానని.. ఇన్‌చార్జ్‌గా ఉన్న ఆరెకోడు తండాలో అలా చేయలేదన్నారు. అందుకు తనకు అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారన్నారు. ఇక విధులపట్ల అలసత్వంగా ఉన్న కార్యదర్శులకు షోకాజు నోటీసులు ఇస్తూనే ఉంటామని ఎంపీవో కొండపల్లి శ్రీదేవి తెలిపారు.

పారిశ్రామిక పార్కులకు

ఆర్థిక సాయం చేయండి

- కేంద్రమంత్రి జితిన్‌రాంకు వినతిపత్రమిచ్చిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



కేంద్ర మంత్రిని కలిసిన డిప్యూటీ సీఎం భట్టి

మధిర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మధిర నియోజకవర్గంలోని రెండు పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ఆర్థిక సాయం చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి జితిన్‌రాం మాంజీని కోరారు. బుధవారం ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో ఆయనను కలిసి మధిర నియోజకవర్గంలో ఇప్పటికే మధిర మండలంలోని యండపల్లిలో 85ఎకరాలు, ఎర్రుపాలెం మండలంలోని రేమిడిచర్ల వద్ద 60ఎకరాల్లో రెండు పారిశ్రామిక పార్కులకు స్థలాలు కేటాయించామని తెలిపారు. ఈ రెండు పార్కులు జాతీయ రహదారి, పోర్టులకు సమీపంలో ఉన్నాయని అందులో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే రవాణాకు అనుకూలంగా ఉండటమే కాకుండా ప్రత్యక్షంగా 5వేల మందికి, పరోక్షంగా మరో 15వేల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ఎంఎస్ఎంఈ-సీడీపీ పథకం కింద ఈ పార్కుల అభివృద్ధికి ఆర్థిక సహాయానికి ప్రతిపాదనలు పంపేందుకు ముందస్తు అనుమతివ్వాలని కేంద్రానికి ఇచ్చిన లేఖలో కోరిందని, రాష్ట్రంలో ప్రతీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున ఈ తరహా పార్కుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు.

జయశంకర్ తెలంగాణ

ఉద్యమ స్ఫూర్తి ప్రదాత

జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



కలెక్టరేట్‌లో కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. జయశంకర్ జయంతి సందర్భంగా బుధవారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయశంకర్ జీవిత చరిత్రకు సంబంధించిన ముఖ్య ఘట్టాలను అధికారులు స్మరించుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జయశంకర్ జయంతిని రాష్ట్ర పండుగలా నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర మరువలేనిదని, మార్గదర్శిగా, వెన్నెముకగా నిలిచారన్నారు. స్వరాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన ఆయన ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీవో ఎ.శ్రీనివాస్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి కె. సత్యనారాయణ, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలత, జిల్లా ఉపాధికల్పన అధికారి ఎస్.మాధవి, కలెక్టరేట్ ఏవో కె.శ్రీనివాసరావు, సబ్ ట్రెజరీ అధికారి వేలాద్రి, జిల్లా అధికారులు, వివిధ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల కోసం..


చలో హైదరాబాద్

- ఉపాధి నర్సరీల్లో ఆరడుగులకు పైగా పెరిగిన మొక్కలు
- ప్రతీ మండలంపై రూ.50వేల వరకు అదనపు భారం
- సొంత నర్సరీలను విస్మరించడంపై తీవ్ర ఆరోపణలు

6

రోడ్డు ప్రమాదంలో సీపీఐ నేత అయోధ్య

దుర్మరణం



- హైదరాబాద్ వెళుతుండగా సూర్యాపేట వద్ద ఘటన
- పార్టీ ఉమ్మడి జిల్లా శ్రేణుల్లో విషాదం
- ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటంతో ప్రత్యేక గుర్తింపు
- కూలీ కుటుంబం నుంచి కీలక నాయకుడిగా ఎదిగిన నేత
- నేడు రామానుజవరంలో అంత్యక్రియలు



ప్రమాదానికి గురైన కారు

మణుగూరు/మణుగూరు రూరల్/కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఉమ్మడి ఖమ్మం జడ్పీ మాజీ వైస్ చైర్మన్ బొల్లోజు అయోధ్యచారి(75) బుధవారం తెల్లవారుజామున సూర్యాపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. వైద్య పరీక్షల కోసం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి వెళ్లేందుకుగాను మంగళవారం రాత్రి మణుగూరు నుంచి వెళ్లిన ఆయన రాత్రి సూర్యాపేటలో ఉన్న తన కుమార్తె ఇంటి వద్ద బస చేశారు. తెల్లవారుజామున అక్కడి నుంచి హైదరాబాద్‌కు పయనమవగా.. బయల్దేరిన కాసేపటికే సూర్యాపేట వన్‌టౌన్ పరిధిలో జీవీ కాలేజీ సమీపంలో ముందుగా వెళుతున్న ఓ లారీని వెనుక నుంచి అయోధ్య ప్రయాణిస్తున్న వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అయోధ్య అక్కడికక్కడే మృతిచెందగా, డ్రైవర్ రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సూర్యాపేట రోడ్ పెట్రోలింగ్ టీమ్ వారిని ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అయోధ్య మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు హేమంతరావులు హుటాహుటిన సూర్యాపేట చేరుకున్నారు. అయోధ్య భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. పోస్టుమార్టం అనంతరం అయోధ్య మృతదేహాన్ని ఖమ్మం తీసుకొచ్చి అక్కడ పువ్వాడ నాగేశ్వరరావు నివాళులర్పించిన అనంతరం కొత్తగూడెం మీదుగా మణుగూరుకు తరలించారు. కొత్తగూడెంలోని సీపీఐ కార్యాలయం శేషగిరిభవన్‌కు తరలించారు. సీపీఐ, సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు వివిధ రాజకీయపక్షాల నాయకులు అయోధ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనేక ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన (మిగతా 6వ పేజీలో)



అయోధ్యకు జోహార్లు అర్పిస్తున్న పువ్వాడ, బాగం, దండి సురేష్

అయోధ్య మృతికి మంత్రులు తుమ్మల, పొంగులేటి సంతాపం

ఖమ్మం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): సీపీఐ సీనియర్ నేత, ఉమ్మడి జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ బొల్లోజు అయోధ్య రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం పట్ల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వేర్వేరుగా సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రకటనలు విడుదల చేశారు. సీపీఐ నేతగా, ఉమ్మడి జడ్పీవైస్‌చైర్మన్‌గా గిరిజన ప్రాంతంలో సమస్యల పరిష్కారానికి అయోధ్య ఎంతో కృషిచేశారని పేర్కొన్నారు. నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకుడిగా రైతు, వ్యవసాయ, కార్మిక, గిరిజనసమస్యలపై అనేక పోరాటాలు, ఉద్యమాలు చేశారని, ఆయన మృతి వామపక్ష ఉద్యమాలకు తీరని లోటన్నారు.



అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

రామయ్యకు పవిత్రారోపణం

భద్రాచలం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం భద్రాద్రి రామయ్యకు అష్టోత్తర శత కలశాభిషేకాన్ని నిర్వహించారు. ముందుగా స్వామివారికి వేద విన్నపాలు నిర్వహించి ఉత్సవ మూర్తులకు అష్టోత్తర శత కలశాభిషేకాన్ని అర్చకస్వాములు నిర్వహించారు. హవనం అనంతరం పవిత్రాలను ప్రధాన ఆలయం నుంచి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి ముందుగా మూలవరులకు ధరింపజేసి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీతాయారు అమ్మవారు, ఆంజనేయస్వామి, భక్తరామదాసు, గోదాదేవి ఆలయాలకు, ఉత్సవమూర్తులకు వేసిన తరువాత చివరగా ఆలయానికి, ధ్వజస్తంభానికి, బలిపీఠానికి పవిత్రాలను ధరింపజేశారు. అలాగే అర్చకులు సైతం పవిత్రాలను ధరించారు. ప్రతి ఏటా (మిగతా 6వ పేజీలో)

శభాష్ కేరళ పోలీస్

క్రీడాకారులు ఆటోలో మరిచి పోయిన పతకాలు, లగేజీ తిరిగి అందజేత



భద్రాద్రి క్రీడాకారులు పోగొట్టుకున్న పతకాలను అందిస్తున్న కోజికోడ్ పోలీసులు

భద్రాచలం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని కోజికోడ్‌లో ఆగస్టు 2 నుంచి 7 వరకు జరుగుతున్న జాతీయస్థాయి మాస్టర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భద్రాచలం క్రీడాకారులు సాధించిన పతకాలు, లగేజీని ఆటోలో మరిచిపోయారు. ఈ క్రమంలో వారు కేరళలోని కోజికోడ్ పోలీసులకు సమాచారం అందించగా వారు 14 గంటల్లోనే ఆటోలో మరిచిపోయిన లగేజీ, పతకాలను క్రీడాకారులకు అందజేశారు. భద్రాచలంకు చెందిన డీవీ శంకర్రావు 4 విభాగాల్లో కలిపి నాలుగు బంగారు పతకాలను సాధించారు. అలాగే వి.మల్లేష్ నాలుగు బంగారు పతకాలు సాధించారు. అలాగే మహంతి వెంకటకృష్ణాజీ 5వ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ క్రమంలో ఆటోలో లగేజీ, వారు సాధించిన పతకాలు పోగొట్టుకోగా ఈ విషయమై వారు కేరళ పోలీసు కంట్రోల్ రూముకు వెళ్లి రాత్రి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కేరళ పోలీసులు 14 గంటల్లోనే వారి లగేజి ఉన్న ఆటోను వెతికి లగేజీ, బంగారు పతకాలను వెతికి కోజికోడ్ ఎస్‌హెచ్‌వో జితేష్ చేతుల మీదుగా అందజేశారు.

విద్యార్థుల భోజన విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్



ప్రసంగిస్తున్న ఐటీడీఏ పీవో బి.రాహుల్

భద్రాచలం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు సరఫరా చేస్తున్న అల్పాహారం, భోజనాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ సంబంధిత పాఠశాలలు, కళాశాలల హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అస్వస్థతగా ఉంటే తక్షణమే ఏఎన్ఎంతో చికిత్సలు చేయించాలని, మూడు రోజులు దాటితే దగ్గర్లోని పీహెచ్‌సీకి తీసుకెళ్లాలని ఆదేశించారు. దోమలు, విషపూరితమైన కీటకాలు సంచరిస్తూ ఉంటాయని, పరిసరాలు ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. అవసరమైతే వారంలో ఒక రోజు క్వార్టర్స్‌లో ఉండే సిబ్బంది, పిల్లలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి శ్రమదానం రూపంలో పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి ఇనిస్టిట్యూట్‌లో పిల్లల చదువుపై ప్రత్యేక బాధ్యత తీసుకోవాలన్నారు. పిల్లలకు అందించే ఆహారంను ఉపాధ్యాయులు రుచి చూసిన తరువాతే పిల్లలకు వడ్డించాలని తెలిపారు. ప్రతి రోజు వంట చేసే సిబ్బంది పరిశుభ్రతను పాటించి వంట పాత్రలు, వంట గది, డైనింగ్ హాలును శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గత ఏడాది కెరీర్ గైడెన్స్‌పై పిల్లలకు అవగాహన పెంచుకున్నారని, 8, 9, 10 తరగతి పిల్లలకు నెలకు రెండో శుక్రవారం, నాల్గో శుక్రవారం తప్పనిసరిగా ఏదో ఒక శాఖ నుంచి ఒక అధికారిని పిలిపించి వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్సీవో గురుకులం అరుణకుమారి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు పాల్గొన్నారు.

మొక్కల కోసం చలో హైదరాబాద్

- ఉపాధి నర్సరీల్లో ఏపుగా ఆరడుగులకు పైగా పెరిగిన మొక్కలు
- ప్రతి మండలంపై రూ.50వేల వరకు అదనపు భారం
- సొంత నర్సరీలను విస్మరించడంపై తీవ్ర ఆరోపణలు

ఖమ్మం రోల్ మోడల్

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ పర్యవేక్షణలో గ్రామ పంచాయతీల్లో నర్సరీలు పెంపకం జరుగుతుంది. సరైన సమయానికి ఆరు అడుగులు మొక్కలను పెంచడంలో రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా ప్రతి సంవత్సరం మోడల్‌గా ఉంటుంది. డీఆర్డీఏ ద్వారా పెంచిన మొక్కలను ఇతర ప్రభుత్వశాఖలకు పంపిణీ చేస్తారు. ఖమ్మం జిల్లాలోని 579 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు పెంచుతున్నారు. ఒక్కో నర్సరీలో 50వేల మొక్కల వరకు పెంచే సామార్థ్యం ఉంది. ఇప్పటికే అన్ని నర్సరీల్లో 5 నుంచి 6 అడుగుల పైబడిన మొక్కలు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ వనమహోత్సవంలో నాటేందుకు కొన్ని లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి.



వనమహోత్సవంలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దూరపు కొండలు నునుపూ అనే చందంగా ఉంది జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారుల తీరు. నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న గ్రామ పంచాయతీలకు మరో అదనపు భారాన్ని మోపుతున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి. నాలుగు నెలల కాలం పాటు బిడ్డల్లా పెంచుకున్న ఉపాధి హామీ నర్సరీలను వదిలిపెట్టి సుదూరంలో ఉన్న హైదరాబాద్‌లోని సీడీఎంఏ నుంచి మొక్కలను కొనుగోలు చేసి తీసుకువచ్చి నాటాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు ఆదేశాలు ఇవ్వడం ఇప్పుడు మండల స్థాయిలో కుదుపునకు దారి తీస్తోంది. దీంతో తెలంగాణ వనమహోత్సవంపై నీలినీడలు అలముకుంటున్నాయి.

హైదరాబాద్ సీడీఎంఏ నుంచి 80 వేల మొక్కల కొనుగోలు

తెలంగాణ వనమహోత్సవంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు మొక్కలు నాటడంపై మండల స్థాయిలోని ఉపాధి అధికారులకు ఆదేశాలిచ్చారు. అయితే ప్రతి సంవత్సరం వలే ఉపాధి హామీలో పెంచిన మొక్కలు కాకుండా ప్రతి మండలానికి హైదరాబాద్ సీడీఎంఏ నుంచి 4 వేల మొక్కలను కొనుగోలు చేసి సొంతంగా ట్రాన్స్‌పోర్టు పెట్టుకొని వారి మండలాలకు తీసుకురావాలని ఆదేశించారు.



నర్సరీల్లో ఆరు అడుగులు పెరిగిన మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ అధికారులు (ఫైల్)

ఈమేరకు ప్రతి మండలానికి రూ.48 వేలు వరకు బిల్లులు పెట్టుకొవటానికి వెసులుబాటు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో మండల స్థాయిలోని అధికారులు అవాక్కయ్యారు. గ్రామస్థాయిలో అందుబాటులో ఉన్న మొక్కలను వదిలి హైదరాబాద్ నుంచి మొక్కలు తెప్పించడం ఏమిటనీ వెనకడుగు వేశారు. కేవలం తల్లాడ, పెనుబల్లి మండలాల అధికారులు మాత్రమే సీడీఎంఏ నుంచి మొక్కలను తెప్పించారు. ఆ డబ్బులను పాత బకాయిలు చెల్లింపులకు ఇవ్వోచ్చు కదా అని కొందరు ప్రశ్నిస్తున్నారు. కాగా దీంతో మిగిలిన మండలాల అధికారులపై వత్తిడి పెంచుతున్నారు. ఖచ్చితంగా సీడీఎంఏ నుంచి ప్రతి మండలానికి 4 వేల మొక్కలను కొనాల్సిందేనని హుకుం జారీచేస్తూ వత్తిడి పెంచుతున్నారు. దీంతో తెలంగాణ వనమహోత్సవంపై విమర్శలు వెలువడుతున్నాయి. రాష్ట్ర మంత్రులు దృష్టి సారించి జిల్లాలోని నర్సరీల్లోని మొక్కలను నాటటం ద్వారా ప్రభుత్వంపై ఆర్థిక భారం తగ్గతో పాటు పెంచిన మొక్కలు సద్వినియోగం జరుగుతాయని మండల స్థాయిలోని ఉపాధి అధికారులు సూచించారు.

తెలంగాణ ఉద్యమానికి అంకితమైన ప్రొఫెసర్ జయశంకర్



ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కమాండెంట్ పెద్దబాబు, సిబ్బంది

సత్తుపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ సిద్ధాంతకర్తగా పేరుపొందారని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెదబాబు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా మండలంలోని గంగారంలోని బెటాలియన్ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్-ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటును కళ్లారా చూడాని ఉందని చెప్పిన ఆయన 2011లో ప్రత్యేక ఏర్పాటుకు ముందే ఆయన మరణించడం తెలంగాణకు తీరని లోటని అన్నారు. అలాంటి మహనీయుల ఆశయసాధనకై మనమంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సహాయ దళాధిపతి ఎస్‌డీ.రంగారెడ్డి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పటాలపు ఇతర అధికారులు, సిబ్బంది, మినిస్ట్రీయల్ స్టాఫ్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన డీఎంహెచ్‌వో



విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో కళావతిబాయి

కల్లూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : కల్లూరులోని గిరిజన ఆశ్రమ పాఠశాలను జిల్లా వైద్యాధికారిణి కళావతిబాయి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో అల్పాహారం పడక విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో వంటశాలను, పరిసరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సీజనల్ వ్యాధుల పట్ల క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సీతారాం, జిల్లా మలేరియా అధికారి వెంకటరమణ, వైద్యాధికారి నవ్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యురాలికి సంపూర్ణత అభియాన్ అవార్డు

ఆళ్లపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు సంఘమిత్ర సంపూర్ణత అభియాన్ జిల్లా అవార్డు అందుకుంది. ఏజెన్సీలో రోగులకు, పిల్లల్లో పోషకాహార లోపాన్ని నియంత్రించడం, ఎనీమియా వంటి సమస్యలను తగ్గించడం, గర్భిణులకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నందుకు గాను ఆమేను గుర్తించారు. కాగా బుధవారం జిల్లా కలెక్టర్ జితేషవిపాటిల్ చేతుల మీదుగా డాక్టర్ సంఘమిత్ర ప్రసంసాపత్రం, మెమెంటో, మెడల్ అందుకున్నారు. ఆమేతో పాటు మర్కోడు సబ్‌సెంటర్ ఆశవర్కరు భారతికి ఈ అవార్డును అందజేశారు. దాంతో ఆమెను మండలంలో పలువురు అభినందించారు.



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఏఎన్ఎం పార్వతి

పినపాక ఏఎన్ఎంకు నీతి అయోగ్ సంపూర్ణత అభియాన్ అవార్డు

కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం స్వీకరణ

పినపాక, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పినపాక ప్రభుత్వాస్పత్రిలో అత్యుత్తమ సేవలు అందించిన ఏఎన్ఎం పార్వతికి జిల్లాస్థాయి నీతి అయోగ్ సంపూర్ణ అభియాన్ అవార్డు లభించింది. పినపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె అందించిన సేవలను గుర్తిస్తూ కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా ఈ అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందించారు. గురువారం పినపాక పీహెచ్‌సీలో అవార్డు అందుకున్న పార్వతిని వైద్యులు దుర్గాభవాని, మధు, సిబ్బంది అభినందనలు తెలిపి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ హనుమంతు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సీపీఐ నేత.. అయోధ్య దుర్మరణం

(5వ పేజీ తరువాయి)

అయోధ్య మృతితో ఉమ్మడి జిల్లాలోని సీపీఐ శ్రేణులు దిగ్భ్రాంతికి గురయ్యారు. సంతాప సూచికంగా మణుగూరు చాంబర్ ఆఫ్ కామర్స్ మణుగూరు స్వచ్ఛంద బంద్‌కు పిలుపునిచ్చింది. విద్యాసంస్థలకు మధ్యాహ్నం నుంచి సెలవు ప్రకటించారు. ఏజెన్సీ ప్రాంతంలో తనదైన రాజకీయ శైలిలో దాదాపు 50 ఏళ్లుగా కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా అయోధ్య చెరగని ముద్ర వేసుకున్నారు.

తుంగతుర్తి నుంచి మణుగూరుకు వలస

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తుంగతుర్తి నియోజకవర్గం గానుగబండ గ్రామంలో నర్సయ్య, ఈశ్వరమ్మ దంపతులకు చివరి కుమారుడిగా 1950లో జన్మించిన అయోధ్య 17ఏట నుంచే సీపీఐ కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించారు. సుమారు 50ఏళ్ల క్రితం ఆ కుటుంబం మణుగూరు మండలం రామానుజవరానికి వలస రాగా.. నాటి నుంచి ఏజెన్సీ ప్రాంతంలో, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జరిగిన పలు ప్రజా పోరాటాల్లో ఆయన పాల్గొని తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. మణుగూరు నియోజకవర్గంలో సింగరేణి, బీటీపీఎస్ పరిశ్రమల ఏర్పాటు, అభివృద్ధి సమయంలో భూనిర్వాసితుల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించిన ఆయన బీసీ నాయకుడిగా రాజకీయాలకు అతీతంగా సేవలందించిన వ్యక్తిగా నిలిచారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గోదావరి జలాల సాధన కోసం సీపీఐ చేపట్టిన మహోద్యమ పాదయాత్ర కార్యక్రమాల్లో కూనంనేని సాంబశివరావుతో పాటు చురుగ్గా పాల్గొన్నారు. 1972లో నాటి ఉమ్మడి రామానుజారం పంచాయతీ ఎన్నికల్లో గెలిచి ఉపసర్పంచ్‌గా పనిచేశారు. అనంతరం మణుగూరు జడ్పీటీసీ సభ్యుడిగా గెలిచి ఉమ్మడి ఖమ్మం జడ్పీ వైస్ చైర్మన్‌గా సేవలందించారు. రెండేళ్ల క్రితం తన భార్య మృతిచెందిన తర్వాత అయోధ్యకు అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో అప్పటినుంచి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ నెలకు రెండు, మూడు సార్లు వెళ్లివస్తుండే ఆయన ఆరోగ్యం సహకరించకపోయినా పార్టీ చేపట్టే ప్రతీ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటూ ఉంటారు.



మణుగూరులో జోహార్లు అర్పిస్తున్న నేతలు

ఐదో ప్రమాదంలో కానరాని లోకాలకు

సీపీఐ నేత అయోధ్య గతంలో నాలుగు సార్లు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. 20ఏళ్ల క్రితం ఇల్లెందు టేకులపల్లి ప్రాంతంలో ఆయన ప్రయాణిస్తున్న జీబు రెండు సార్లు ప్రమాదాలకు గురైంది.. ఈ ఘటనల్లో స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఆ తర్వాత పినపాక నియోజకవర్గంలోని అశ్వాపురం మండలం మొండికుంటలో, మణుగూరు మండలం తోగ్గూడెంలో జీబు టైర్ పగిలిన ఘటనల్లో రెండుసార్లు వాహనం పల్టీలు కొట్టింది. ఆ సందర్భాల్లోనూ ఆయనకు గాయాలయ్యాయి. ఇక బుధవారం సూర్యాపేటలో జరిగిన ప్రమాదంలో ఆయన కన్నుమూశారు. అయోధ్య మృతదేహానికి గురువారం ఆయన స్వగ్రామమైన మణుగూరు మండలం రామానుజవరంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, పార్టీ నాయకులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు.

పలువురు నేతల సంతాపం

అయోధ్య దుర్మరణం పాలవడం పట్ల ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి సంతాపం తెలిపారు. పార్లమెంట్ సమావేశాల కోసం ఢిల్లీలో ఉన్న ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి వెళ్లిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడి.. అయోధ్య మృతి బాధాకరమన్నారు. కొత్తగూడెంలోని సీపీఐ కార్యాలయం శేషగిరిభవన్‌లో ఏర్పాటుచేసిన సంతాప సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో కమ్యూనిస్టు నేతగా ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడని, ఏజెన్సీ ప్రజల సమస్యలపై అనేక ఉద్యమాలు చేపట్టిన ప్రజా నాయకుడన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకుడు అన్నవరపు కనకయ్య, మైనార్టీ నాయకుడు నాయింఖురేషీ, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్ద భిక్షం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, చంద్రగిరి శ్రీనివాసరావు తదితర నాయకులు అయోధ్యకు నివాళులర్పించారు.

ఖమ్మంలో నివాళులర్పించిన నేతలు

ఖమ్మం సంక్షేమవిభాగం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య మృతదేహాన్ని మణుగూరు తరలించే క్రమంలో తొలుత ఖమ్మం సీపీఐ కార్యాలయం వద్ద కాసేపు ఉంచారు. ఈ క్రమంలో పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు, నేతలు పోటు ప్రసాద్, బాగం హేమంతరావు, మహ్మద్ మౌలానా, దండి సురేశ్, సాబీర్‌పాషా, జమ్ముల జితేందర్‌రెడ్డి, పాకాలపాటి లలిత, రాజేశ్వరి, యర్రా బాబు తదితరులు నివాళులు అర్పించారు. పువ్వాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ అయోధ్య మరణం పార్టీకి తీరని లోటని, నిబద్ధత గల నాయకుడిని కోల్పోయామన్నారు.

రామయ్యకు పవిత్రారోపణం

(5వ పేజీ తరువాయి)

ఆలయంలో సకల దోష నివారణార్థం పవిత్రోత్సవాలను నిర్వహించడం సంప్రదాయం. అందులో భాగంగా సోమవారం పవిత్రోత్సవాలకు అంకురారోపణం గావించారు. ఈ నెల 4 నుంచి 9 వరకు ఆలయంలో ప్రతిరోజు నిర్వహించే నిత్య కల్యాణాలను నిలిపివేశారు. గురు, శుక్రవారాల్లో నిత్య హోమాలు నిర్వహించి వేదపారాయణం చేయనుండగా 9న పూర్ణాహుతి, పవిత్రాల ఉద్వాసన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, అమరవాది మురళీకృష్ణమాచార్యులు, అమరవాది గోపాలాచార్యులు, ముఖ్య అర్చకుడు అమరవాది మధుసూదనాచార్యులు, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి

తల్లాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, శిశువులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.కళావతి బాయి సూచించారు. బుధవారం తల్లాడలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణతో కలిసి ఆమె సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు సహజ ప్రసవం, తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు ఈనెల 11న ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సు వారికి నులిపురుగులు నివారణ మాత్రలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కె.ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏన్కూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరులో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలవగా వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. మణుగూరు నుంచి ఖమ్మం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు. ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వెళుతున్న బైకును ఏన్కూరు వద్ద ఢీ కొట్టింది. ఈఘటనలో బైకుపై ప్రయాణిస్తున్న రవితేజ(25), అఖిల్‌రెడ్డి(20)కి గాయలయ్యాయి. వారు హైదరాబాద్‌కు చెందిన వారని, కొత్తగూడెం వైపు వెళుతున్నట్టు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఆ యువకులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ రఫి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

మండల ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సస్పెండ్

తల్లాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఐ.రత్నమనోహర్ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు సీఎంవో కార్యాలయం నుంచి ఆయనకు సస్పెన్షన్ ఉత్వర్వులు అందాయి. గత నెల 24వతేదీన తల్లాడలో డెంగ్యూతో యోగా శిక్షకురాలు కందుల శ్రీదేవి మృతి చెందడంతోపాటు అదే కుటుంబానికి చెందిన ఆమె కుమార్తె యశశ్రీ, మేనల్లుడు నిషాల్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావు స్పందించి.. విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీఎంవో నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈమేరకు 25వతేదీన అదనపు కలెక్టర్ శ్రీజ తల్లాడ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యాధికారి డాక్టర్ ఐ.రత్నమనోహర్‌ను విచారించి ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఈ క్రమంలో రత్నమనోహర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. డాక్టర్ కె.ప్రత్యూషకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

నష్టపరిహారం రాబట్టడమే మా లక్ష్యం

ఆయిల్‌పామ్ రైతులు



కిష్టాపురంలో ఆఫ్‌టైప్ మొక్కలనుపరిశీలిస్తున్న రైతులు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌ఫెడ్‌తో ప్రభుత్వం నుంచి నష్టపరిహారం రాబట్టడమే తమ లక్ష్యమని తెలంగాణ ఆయిల్‌పామ్ రైతుసంఘం అధ్యక్షుడు ఉమామహేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం సత్తుపల్లి మండలం కిష్టాపురంలో ఆయిల్‌పామ్ హాఫ్‌టైప్ మొక్కల బాధిత రైతుల సమావేశం నిర్వహించారు. హాఫ్‌టైప్ మొక్కలతో పామాయిల్ రైతులకు తీరని అన్యాయం జరిగిందని, ఈ విషయమే పలు దశల్లో ఆయిల్‌ఫెడ్‌తో పాటు రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ క్రమంలో బాధిత రైతుల తోటలను పరిశీలించి అందరినీ కూడగడుతున్నామని చెప్పారు. బీకేఎస్, సీపీఎం పార్టీ అనుబంధ సంస్థలు సైతం తమతో కలిసి రైతులందరికీ న్యాయం జరిగే వరకు పోరాటం చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతుసంఘం కార్యదర్శి బొంతు రాంబాబు, కొక్కెరపాటి పుల్లయ్య, రాముల రాజబాబు, బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు రామారావు, శ్రీనివాస్, మల్లెంపాటి రమేష్, తుంబూరు సొసైటీ చైర్మన్ చిలుకుర్తి కృష్ణమూర్తి, గిరిజన సంఘ నాయకులు కారం శ్రీరాములు, ఉమామహేశ్వరరెడ్డి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పారిపోయిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఖమ్మంక్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కేసులో పారిపోయిన నిందుతుడిని బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు ఖమ్మం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్సై మోహన్‌బాబు తెలిపారు. ఈనెల 3న నగరంలోని రంగనాయకుల గుట్ట వద్ద వాహనాల తనిఖీల సందర్భంగా ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్న బుర్రి. మల్లిఖార్జున్‌రావు గంజాయి విక్రయిస్తుండగా గుర్తించి అతనిని పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయాడు. అతని వద్ద గంజాయి, ఆటో ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు. నాటి నుంచి తప్పించుకోని తిరుగుతున్న నింధితుడిని బుధవారం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఖాతాలో నగదు మాయం

ఖమ్మంక్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకు బ్యాలెన్స్ చెక్ చేసుకోమంటూ సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్ ఓపెన్ చేయడంతో ఖాతాలో నగదు పోయిన సంఘటన బుధవారం ఖమ్మం నగరంలో చోటుచేసుకుంది. యూపీహెచ్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి ఈ.పుల్లయ్య ఇటీవల సైబర్ మోసగాళ్ల వలలో చిక్కుకున్నాడు. గత నెల 26వ తేదీన ఆయన మొబైల్‌కు బ్యాంకు బ్యాలెన్స్ చెక్ చేసుకోవాలంటూ ఓ సందేశం వచ్చిందని, దానిని నొక్కగానే నాలుగు దఫాలుగా రూ. 99 వేల, 820 తన ఖాతా నుంచి మరో అకౌంట్‌కు బదిలీ అయ్యాయని బాధితుడు ఫిర్యాదులో తెలిపాడు. ఈ మేరకు ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో పుల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఘటనపై విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి కార్మికుడి మృతి

ఖమ్మంక్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు బావిలోకి జారిపోవటంతో ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన ఖమ్మం నగరంలోని ఖానాపురం పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం యూపీకి చెందిన సుధీర్ కుమార్(32) గ్రానైట్ పరిశ్రమలో కార్మికుడు పని చేస్తున్నాడు. అతను మద్యం మత్తులో ఫోన్ మాట్లాడుతూ అజాగ్రత్తతో బావిలో పడిపోయాడు. దీన్ని గమనించిన సహచర కార్మికులు వెంటనే స్పందించినా కార్మికుడి ప్రాణాలను కాపాడలేకపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు మృతుడి సమీప బంధువు ఫిర్యాదు మేరకు ఖమ్మం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు. జరిగిన సంఘటనపై దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు.

ఓపెన్ స్కూల్స్ ద్వారా చదువు కొనసాగించొచ్చు

జిల్లా కో ఆర్డినేటర్ పాపారావు

కారేపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ సంఘం లీడర్లు, మధ్యలో చదువు మానేసిన వారు ఓపెన్ స్కూళ్ల ద్వారా చదువు కొనసాగించ వచ్చని ఓపెన్ స్కూల్స్ జిల్లా కో ఆర్డినేటర్ మద్దినేని పాపారావు అన్నారు. బుధవారం కారేపల్లి మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఓపెన్ స్కూల్స్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ చదువు మధ్యలో ఆపిన వారికి ఓపెన్ స్కూళ్లు, కాలేజీ ద్వారా పది, ఇంటర్ పరీక్షలను రాసే అవకాశం ఉందన్నారు. పదో తరగతి పరీక్షలు రాసేవారు రూ.1150, ఇంటర్‌కు రూ.1500 మీసేవ కేంద్రాల ద్వారా చెల్లించి రసీదులను ఓపెన్‌స్కూల్లో అందచేయాలన్నారు. ఈ ఫీజులను ఈ నెల18వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో అనిల్, పుష్ప, చైతన్య, సోందు, గౌసియాబేగం, విజయలక్ష్మి, జయపాల్, నాగలక్ష్మీ, సునిత, తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల మంజూరులో.. అవకతవకలు!

అర్హులకు మొండిచేయి.. అనర్హులకు పెద్దపీట

అధికార పార్టీ నేతల చేతివాటం..

సిబ్బందికి అమ్యామ్యాలు..

రంగంలోకి దళారులు

జూలూరుపాడు మండలంలో

రూ.10వేల వరకు వసూళ్లు!

జూలూరుపాడు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తకార్డులు అందిస్తుండటంతో ఆశలు పెంచుకున్నారు. ఆ ఆశలపై అధికార పార్టీ నాయకులు, కొందరు దళారులు నీళ్లు చల్లుతున్నారు. సంబంధిత శాఖ సిబ్బందికి అమ్యామ్యాలు సమర్పించి అనర్హులకు సైతం కార్డులు ఇప్పించే పనిలో నేతలు, దళారులు తలమునకలయ్యారు. కార్డులు మంజూరు చేయించడానికి వేలాది రూపాయలను వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జూలూరుపాడు మండలంలో రేషన్‌కార్డుల కోసం ధనవంతులు కూడా భారీగా దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులు సరైన రీతిలో దరఖాస్తుల పరిశీలన చేసి విచారణ చేపట్టకపోవడంతో వీటి మంజూరులో పారదర్శకత లోపించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని 24 పంచాయతీల్లో కొత్తరేషన్‌కార్డుల కోసం ఇప్పటి వరకు 1163 మందితో పాటు మరో 1234 మంది పేర్లను నమోదు చేయడానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇప్పటికే 874 మందికి రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. ఇంకా 289 మందికి సంబంధించి కార్డులు మంజూరు కావాల్సి ఉంది.



వెంగన్నపాలెంలో మహిళకు రేషన్‌కార్డు మంజూరీ పత్రాన్ని అందజేస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్(ఫైల్)

అనర్హులకు కార్డుల మంజూరు..

వెంగన్నపాలెం, జూలూరుపాడు, గుండెపూడి, పాపకొల్లు, పడమటి నర్సాపురం గ్రామాల్లో ఆర్థికంగా, ఉన్నతస్థాయిలో ఉన్న వారికి సైతం రేషన్‌కార్డులు మంజూరు కావడం విస్మయాన్ని కలిగిస్తోంది. అదేవిధంగా బడా వ్యాపారులు, నాలుగు చక్రాల వాహనాలున్న వ్యక్తులకు, పన్నులు చెల్లించే వారికి, 10 ఎకరాలపైన భూములున్న వారికి కూడా రేషన్‌కార్డులు మంజూరు చేయించడాన్ని గమనిస్తే అవకతవకలు ఏ స్థాయిలో జరిగాయో అర్థమవుతోంది. పేదలకు అందాల్సిన ఫలాలు, గద్దలు తన్నుకపోయినట్లు ధనవంతులు ఈ కార్డులను సొంతం చేసుకోవడం ఆశ్చర్యాన్ని కలిగించక మానదు. మండలంలో రేషన్‌కార్డులు మంజూరులో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

అధికార పార్టీ నాయకులు, దళారుల చేతి వాటం..

రేషన్‌కార్డుల మంజూరీ విషయంలో కొంతమంది అధికార పార్టీ నాయకులతోపాటు కొందరు దళారులు రంగప్రవేశం చేసి చక్రం తిప్పుతున్నారు. అనర్హులకు కార్డులు ఇప్పించే విషయంలో వీరు కీలక పాత్ర పోషిస్తోన్నారు. అర్హత లేని వారికి కార్డులు మంజూరు చేయించడానికి రూ. 3వేల నుంచి రూ. 10వేల వరకు డబ్బులు వసూలు చేస్తున్నారు. వసూలు చేసిన సొమ్ములో కొంతమొత్తాన్ని సంబంధిత సిబ్బందికి ముట్టచెప్పి కార్డులు మంజూరు చేయిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తోన్నాయి.



రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు అందించేందుకు తహసీల్దార్ కార్యలయంలో వేచివున్న ప్రజలు(ఫైల్)

విచారణ చేపడతాం..

శ్రీనివాస్, తహసీల్దార్, జూలూరుపాడు



అనర్హులు ఎవరికైనా రేషన్‌కార్డులు మంజూరు అయినట్లయితే విచారణ చేపట్టి తొలగిస్తాం.. దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధించి విచారణ చేసిన తర్వాతే రేషన్‌కార్డులను మంజూరు చేశాం. రేషన్‌కార్డులు అనర్హులకు మంజూరైతే వారి వివరాలను తెలియచేస్తే వాటిని వెంటనే రద్దు చేస్తాం.

ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలకు శిక్షణ పూర్తి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ సెంట్రల్ టీం గత మూడు రోజులుగా ఇస్తున్న శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఆశాకార్యకర్తలకు స్ఫూర్తి మీటింగ్ హాల్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి మాట్లాడుతూ ఆశా కార్యకర్తతో పాటు ఇప్పటి వరకు శిక్షణ పొందిన ఐసీఎంఆర్ సర్వేయర్లు ఆ పరిధిలోని ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. ఇళ్లలో హైపర్ టెన్షన్, మధుమేహం వ్యాధిగ్రస్తులు మందులు వాడుతున్నారా లేదా, వ్యాధి కంట్రోల్‌లో ఉందా లేదా, జీవన విధానాలు మార్చుకున్నారా లేదా, మందుల డోస్ తగ్గిందా, పెరిగిందా అనే విషయాలు తెలుసుకొని సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. మానసిక ప్రశాంతత అలవర్చుకోవాలని, నిరాశ, నిస్పృహలకు లోనుకావద్దని, పోషకాహారం తీసుకోవాలని, సరిపడా నిద్ర పోవాలన్నారు. అవసరం మేరకు విశ్రాంతి తీసుకోవాలని పేషంట్లకు అవగాహన కల్పించాలన్నారు. సర్వేయర్లు సేకరించిన డాటాను ఐసీఎంఆర్ విశ్లేసించి మార్గదర్శకాలు అందిస్తారని తెలిపారు. సర్వే సందర్భంగా అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించాలని ఆమె సూచించారు. ఐసీఎంఆర్ బృందం సభ్యులు డాక్టర్ డీఆర్ స్వాతి, ప్రాజెక్ట్ సైంటిస్ట్, డాక్టర్ రోహిత్ గగ్రా, ప్రాజెక్ట్ కన్సల్టెంట్లు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామారావు, డెమో సుబ్రహ్మణ్యం, హెల్త్ ఎడ్యుకేటర్ మురళీ, డీడీఎం నాగరాజు, డాటాఎంట్రీ ఆపరేటర్ చారి, ప్రాజెక్ట్ క్వాలిటీ సూపర్‌వైజర్ మాలతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థిని తల్లి లేకుండానే విచారణ

గోప్యంగా ఉంచిన అధికారులు

దుమ్ముగూడెం ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగరం ఏకలవ్య పాఠశాలలో విద్యార్థినిపై ఉపాధ్యాయుడు ఎల్.నాగేశ్వరరావు అసభ్యకర ప్రవర్తనపై ఆర్‌సీఓ అరుణ కుమారి బుధవారం విచారణ జరిపారు. పాఠశాల పోక్సో కమిటీ ఆధ్వర్యంలో విచారణ జరిగినట్లు తెలుస్తోండగా, ఈ విషయాన్ని అధికారులు అత్యంత గోప్యంగా ఉంచడం గమనార్హం. కాగా విద్యార్థిని ఉపాధ్యాయుడిపై చేసిన ఆరోపణల్లో కొన్ని నిజాలు తేలినట్లు సమాచారం. తల్లి పక్కన లేకుండా పన్నెండేళ్లలోపు బాధిత విద్యార్థిని అధికారులు విచారణ జరపడం విమర్శలకు దారి తీస్తోంది. విద్యార్థిని భయపడి నిజాలు చెప్పలేకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఆర్‌సీఓను వివరణ కోరేందుకు పలు మార్లు ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని మహిళకు తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాధారుక్మిణి

పెనుబల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కోండ్రుపాడు నుంచి పెనుబల్లికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ ఢీ కొని ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం నాయకులగూడెం గ్రామంలో జరిగింది. కోండ్రుపాడుకు చెందిన ట్రాక్టర్ ఇసుకలోడుతో పెనుబల్లికి వెళుతుండగా.. నాయకులగూడెం వద్ద ఇంటిముందు నిల్చున్న రాధారుక్మిణి అనే మహిళను ఢీ కొట్టి ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రాధారుక్మిణికి తీవ్రగాయాలవడంతో తొలుత పెనుబల్లి ఆసుపత్రికి, అక్కడ నుంచి ఖమ్మం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సెప్టెంబరు 10 నుంచి అదనపు తరగతులు నిర్వహించాలి

ఎంఈవోల సమావేశంలో

రాష్ట్ర విద్యాశాఖ అదనపు డైరక్టర్ విజయలక్ష్మీబాయి

ఖమ్మం ఖానాపురంహవేలి /కూసుమంచి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో సెప్టెంబరు 10 నుంచి పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ అదపను డైరెక్టర్ విజయలక్ష్మీ బాయి అన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకంగా తరగతులు నిర్వహించి పదో తరగతి ఫలితాల్లో ఖమ్మం జిల్లాలను ప్రథమ స్థానంలో ఉండేలా ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం ఖమ్మం చేరుకున్న విజయలక్ష్మీబాయి కూసుమంచి కేజీబీవి, భవితా సెంటర్లను పరిశీలించి పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్నమధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ఖమ్మం నగరంలోని యూఆర్ఎస్ (అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్)లను తనిఖీ చేశారు. సాయంత్రం నగరంలోని రోటరీనగర్ పాఠశాలలో ఎంఈవోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ ప్రతి 15 రోజులకు ఒకసారి ఎంఈవోలు ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరాసి)పై ప్రత్యేక శ్రద్ధపెట్టి కార్యచరణ రూపొందించి ప్రతి ఒక్క విద్యార్థి రాయటం, చదవటం చేసేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయులు ఫేస్ హాజరు తప్పక వేయాలని, ఏమైన ఇబ్బందులు ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు. నూరు శాతం హాజరు అయ్యే విధంగా చూడాలని ఆదేశించారు. ప్రతి ఉన్నత పాఠశాలలో డిజిటల్ విద్యపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి నాగపద్మజ, జీసీడీవో తులసి, ఏఎస్‌వో భానుప్రకాశ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. రాతి రఘునాథపాలెం కేజీబీవీలో భోజనం చేసి బస చేయనున్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న విజయలక్ష్మీబాయి

చింతమొక్క తిరుగుతోంది..!

ములకలపల్లి మండలం సీతారాంపురం గ్రామంలో వింత ఘటన





తిరుగుతున్న చింత మొక్కను తిలకిస్తున్న గ్రామస్థులు

ములకలపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ములకపల్లి మండలం సీతారాంపురంలో వింత ఘటన చోటు చేసుకుంది. ఎస్సీ కాలనీలో నివాసం ఉండే వెంకటమ్మ.. బుధవారం ఉదయం ఇంటి వాకిలి ఊడుస్తుండగా.. చింత మొక్క తానంతట తానే గుండ్రంగా తిరగడాన్ని గమనించింది. తొలుత భయపడిన ఆమె కుటుంబసభ్యులను పిలిచి చూపించగా.. విషయం ఆనోట ఈనోట పడి బయటకు రావడంతో గ్రామస్థులు వచ్చి ఆశ్చర్యంగా చూస్తున్నారు. మొక్క గుండ్రంగా తిరుగుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో చుట్టుపక్కల ప్రాంతాల వరు కూడా వచ్చి ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఇదేమి మాయో.. ఏం జరుగుతుందో తెలియడం లేదంటూ చర్చించుకుంటున్నారు.

బర్త్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేస్తే.. మరణ ధ్రువీకరణ జారీ

- కూసుమంచి తహసీల్దార్ కార్యాలయంలో ఘటన
- ప్రశ్నించిన బాధితులపై దుర్భాషలాడిన సెక్షన్ అధికారి

కూసుమంచి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బతికుండగానే డెత్ సర్టిఫికెట్ జారీ చేసిన ఘటన కూసుమంచి తహసీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకుంది. చేసిన తప్పును సదరు సెక్షన్ అధికారి సరిదిద్దుకోకపోగా తమనే దబాయించి మందలించాడని బాధితులువాపోయారు. బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని గట్టుసింగారం గ్రామానికి చెందిన కడారి ఉపేందర్, మమత దంపతులు తమ కూతురు మాదవిద్య జనన సర్టిఫికెట్ కోసం పుట్టిన ఆరునెలల తర్వాత దరఖాస్తు చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులు లేనందున తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కార్యదర్శి చెప్పారు. దీంతో బాలిక తల్లితండ్రులు గత ఏడాది డిసెంబరు 17న బాలిక జనన సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో చలానా కట్టారు. అప్పటినుంచి అవి జతపర్చిన ధృవీకరణ పత్రాలు సరిగా లేవంటూ కాలాయాపన చేశారు. అనంతరం ఆగస్టు నాలుగోతేదీన సర్టిఫికెట్ చేతికందించారు. బాలిక తల్లి పరిశీలించగా బర్త్ సర్టిఫికెట్ బదులు డెత్ సర్టిఫికెట్ జారీచేసినట్లు గమనించింది. ఇదేంటని ప్రశ్నించడంతో వెంటనే లాక్కొన్న సెక్షన్ ఆఫీసర్ దానిని చింపేశాడు. డెత్ బదులు మరల బర్త్ సర్టిఫికెట్ అందించారు. కానీ అందులో ఎక్కడ డెలివరీ అయిన వివరాలు లేకపోవడంతో.. సర్ హాస్పిటల్ వివరాలు నమోదు చేయాలని అడగ్గా దుర్భాషలాడాడు. దీంతో వారు తహసీల్దార్‌ను కలిసేందుకు వెళ్లగా అందుబాటులో లేకపోవడంతో ఇంటికి వెళ్లిపోయారు. ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని కోరారు. తహసీల్దార్ రవికుమార్‌ను వివరణ కోరగా తాను బుధవారం కార్యాలయానికి రాలేదని, కోర్టు పనిమీద హైదరాబాద్ వెళ్లానని తెలిపారు. బాలిక తల్లితండ్రులు ఫోన్‌లో విషయం తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. పొరపాటు జరిగితే సరిచేసి బర్త్ సర్టిఫికెట్ తిరిగి జారీ చేస్తామని తెలిపారు.



REVENUE DEPARTMENT
DEATH CERTIFICATE
FEMALE

బర్త్ సర్టిఫికెట్ బదులు డెత్ సర్టిఫికెట్ జారీ చేసిన అధికారులు

మీ ఇంట్లో మేమే చోరీ చేశాం!

- బాధితుడికి ఫోన్ చేసి వివరాలు చెప్పిన దొంగ
- వాటా పంపకాల్లో తేడా రావటంతో సమాచారం
- వైరాలో సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసులు

వైరా, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): చోరీ చేసిన సొత్తు పంపకాల్లో తేడా రావటంతో నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. ఈ ఘటన వైరాలో జరిగింది. వైరా ఎస్ఐ పి.రామారావు కథనం ప్రకారం.. మండలంలోని పూసలపాడు గ్రామంలో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి చెరుకుపల్లి ప్రసాద్ ఇంట్లో గతఏడాది ఆగస్టులో చోరీ జరిగింది. ఆయన ఇంటి సమీపంలోనే ఉన్న సిరిపురం గ్రామానికి చెందిన ఇసాక్, సాయి అనే యువకులు ఎల్‌ఈడీ టీవీ, కొంత నగదు, ఇతర వస్తువులను చోరీ చేశారు. చోరీ జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. ఆతర్వాత బాధితుడు ప్రసాద్ వైరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంవత్సరకాలం తర్వాత చోరీ చేసిన సొత్తు వాటాల పంపకాల్లో ఇసాక్, సాయి మధ్య విబేధాలు తలెత్తాయి. దాంతో ఈ ఇద్దరిలో ఒకరు ప్రసాద్‌కు ఫోన్ చేశాడు. మీ ఇంట్లో చోరీ చేసింది మేమేని సమాచారం ఇచ్చాడు. ఆవెంటనే బాధితుడు ప్రసాద్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఆవెంటనే ఎస్ఐ రామారావు, ట్రైనీ ఎస్ఐ పవన్ సిరిపురం గ్రామానికి చేరుకొని దొంగతనానికి పాల్పడిన యువకుడి ఇంట్లో ఉన్న ఎల్‌ఈడీ టీవీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

వ్యాన్‌ను ఢీకొట్టిన లారీ

- ఎన్‌పీడీసీఎల్ సబ్ ఇంజనీర్ మృతి
- తల్లి, భార్య, కుమారులకు తీవ్ర గాయాలు

జూలూరుపాడు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటనర్సాపురం ఆశ్రమ ఉన్నత పాఠశాల సమీపంలో బుధవారం సాయంత్రం ఓమినివ్యాన్‌ను లారీఢీకొన్న సంఘటనలో ఎన్‌పీడీఎల్ ఉద్యోగి మృతి చెందారు. మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఖమ్మంజిల్లా కొణిజర్ల మండలం గద్దలగూడెం గ్రామానికి చెందిన రేపల్లె చెన్నారావు (35) ఖమ్మం త్రీటౌన్ పరిధిలోని ఎన్‌పీడీసీఎల్ కార్యాలయంలో సబ్‌ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మేనకోడలు నిశ్చితార్థం వేడుకలో పాల్గొనేందుకు భార్య భార్గవి, తల్లి సావిత్రి, ఇద్దరు కూమారులతో పాటు మరో నలుగురు బంధువులు కలసి ఓమిని వ్యాన్‌లో ఖమ్మం నుంచి భద్రాద్రి జిల్లాలోని సుజాతనగర్ మండలం సర్వారానికి వెళుతున్నారు. వ్యాన్‌ను ఉద్యోగి చెన్నరావు నడుపుతున్నాడు. ఈ క్రమంలో జూలూరుపాడు మండలంలోని పడమటనర్సాపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల సమీపంలో కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళుతున్న లారీ ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈసంఘటనలో చెన్నరావు మృతి చెందాడు. భార్య భార్గవి, తల్లి సావిత్రి, ఇద్దరు కూమారులకు గాయాలయ్యాయి. 108లో వైద్యచికిత్సలను అందించేందుకు కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.





చెన్నారావు (ఫైల్), ప్రమాదంలో దెబ్బతిన్న వాహనం

బాలికపై లైంగికదాడి కేసులో 20ఏళ్ల జైలు

ఖమ్మంలీగల్,ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగికదాడి చేసిన కేసులో 20 సంవత్సరాల జైలుశిక్షతోపాటు రూ.50వేల జరిమానా విధిస్తూ ఖమ్మం జిల్లా పోక్సో మొదటి న్యాయస్థానం ఇన్‌చార్జ్ న్యాయాధికారి కె.ఉమాదేవి బుధవారం తీర్పుచెప్పారు. ఫిర్యాది కథనం ప్రకారం.. 2024లో వైరా మండలం గోల్లనపాడు గ్రామానికి చెందిన చెరుకూరి లాలయ్య స్కూల్ నుంచి వచ్చి ఇంటిముందు ఆడుకుంటున్న చిన్నారికి మాయమాటలు చెప్పి ఇంటికి తీసుకుపోయాడు. బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు.ఈఘటనపై కుటుంబ సభ్యులు వైరా పోలీసులకు ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. చార్జీషీట్‌ను దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయాధికారి నేరం రుజువుకావటంతో పై విధంగా శిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.డి.ఎర్షాద్ వాదించగా, కోర్టు కానిస్టేబుల్ చిరంజీవి, కోర్టు లైజనింగ్ అధికారులు శ్రీకాంత్, ఆర్.నాగేశ్వరరావు, హోంగార్డు చిట్టిబాబు సహకరించారు.

అనుమతులు లేని పాఠశాల సీజ్

చుంచుపల్లి,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నఓ ప్రైవేటు పాఠశాలను చుంచుపల్లి మండల విద్యాశాఖ అధికారులు బుధవారం సీజ్ చేశారు. నందాతండా పంచాయతీలో మూడేళ్లగా ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఒకటవ తరగతి నుంచి ఐదోతరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు.గతంలో పలు మార్లు నోటీసులు ఇచ్చిన స్పందించలేదు. ఈక్రమంలో నూతనంగా ఇన్‌చార్జ్ డీఈవోగా బాధ్యతలు స్వీకరించిన నాగలక్ష్మీ ఆదేశాలనుసారం మేరకు చర్యలు ఎంఈవో బాలాజీ తెలిపారు. అనంతరం ఐదో తరగతి విద్యార్థులను కొత్తగూడెం పట్టణంలోని వేరే బ్రాంచ్‌కి పాఠశాల బస్సుల్లో తరలించారు.సమాచారం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

పదిమందిపై కేసుల నమోదు

వైరా,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో రోడ్లపై అడ్డంగా ఇసుక, కంకర ఇతర వస్తువులను పోసి ప్రజలకు అసౌకర్యం కల్గిస్తున్న పదిమందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ పి.రామారావు తెలిపారు. హనుమాన్‌బజార్, స్వతంబజార్, గాంధీనగర్‌లోని పలుకాలనీల్లో గృహనిర్మాణాల నిమిత్తం పలువురు రోడ్లపైనే ఇసుక, కంకర, సెంట్రింగ్ ఇతర వస్తువులను ఉంచారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు సిటీ పోలీస్‌యాక్టు కింద కేసులు నమోదు చేశామని చెప్పారు.

ప్రవీణ్, విజయ్‌పై పీడీయాక్ట్ కొనసాగింపు

ఖమ్మంక్రైం,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న రౌడీషీటర్ పేరెల్లి ప్రవీణ్, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న పగడాల విజయ్ అలియాస్‌చంటిలపై ప్రివెంటివ్ డిటెక్షన్ (పీడీ యాక్టు) కొనసాగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. పగడాల విజయ్ అలియాస్ చంటిపై పీడీ యాక్టు అమలు చేసి హైదరాబాదు చంచల్‌గూడ జైలకు పంపారు. కాగా పీడీయాక్టు అడ్వయిజరీ కమిటీ పరిశీలించి పీడీయాక్టును 12నెలల పాటు కొనసాగిస్తూ ఉత్తర్వు జారీచేసినట్టు తెలిపారు. ప్రవీణకుమార్ గతంలో సుమారు 30 కేసుల్లో 21కేసుల్లో అరెస్టయిజైలుకు వెళ్లాడు. బెయిల్‌పై తిరుగుతున్నాడు. భూవివాదం ఉంటే తప్పుడు పత్రాలు సృష్టించి అడ్డుకున్న వారిని చంపుతాని బెదిరించడం నైజంగా మారింది. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుండటంతో పీడీ యాక్టు అమలు చేసి హైదరాబాదు చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించినట్టు తెలిపారు.

శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో హుండీ చోరీ

కామేపల్లి, ఆగస్ట్ 6(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండల పరిధిలోని తాళ్లగూడెం శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారిఆలయంలో హుండీ మంగళవారం అర్ధరాత్రి చోరీకి గురైంది. ఈ ఆలయంలో ఇప్పటివరకు మూడు, నాలుగు సార్లు హుండీని దొంగలు ఎత్తుకెళ్లారు. మంగళవారం జరిగిన చోరీలో హుండీలో సుమారు రూ.5వేల నగదు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి



కామేపల్లి, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): రెండేళ్ల బాలుడు నీటిసంపులో పడి మృతిచెందాడు. సంఘటన కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో బుధవారం జరిగింది. బాదావత్ నాగరాజు కవితలకు ఇద్దరు అమ్మాయిలు ఓ కుమారుడు ఉన్నారు. కవిత అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తుంది. అయితే బుధవారం సాయంత్రం కవిత తన ఇద్దరు పిల్లలకు స్నానం చేపిస్తోంది. ఆడుకుంటున్నా జయరామ్‌రిషినాయక్ (2) ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయాడు. ఆ విషయం తల్లికి తెలియదు. కొద్దిసేపటి తరువాత బాలుడి కోసం వెతుకుతుండగా సంపులో పడిపోయి ఉన్నాడు. స్థానికుల సహాయంతో బయటికి తీసి ఖమ్మం ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు.

డెంగ్యూతో యువకుడి మృతి



కూసుమంచి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న పందిరి అప్పిరెడ్డి (24) డెంగ్యూ జ్వరంతో మృతిచెందాడు. కుటుంబసభ్యుల కథనం మేరకు.. అప్పిరెడ్డి కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు.ఈక్రమంలో జ్వరం తీవ్రత పెరగడంతో ఖమ్మంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతిచెందాడు.



ఏటీసీ కోర్సులతో ఉపాధికి భరోసా

- ఖమ్మం ప్రభుత్వ పారిశ్రామిక సంస్థలో యువతకు శిక్షణ
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంఖానాపురం హవేలి, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): యువతకు ఏటీసీ కోర్సులతో ఉపాధికి భరోసా లభిస్తుందని జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఖమ్మం టేకులపల్లిలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థను అప్‌గ్రేడ్ చేసిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఏటీసీ నూతన భవనంలో ఏర్పాటు చేస్తున్న మిషనరీలను పరిశీలించారు. పరికరాల పనితీరును ట్రైనర్స్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, యువతకు కావలసిన సౌకర్యాలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఐటీఐలు ఇప్పుడు కొత్త సాంకేతికతతో అత్యాధునిక వసతులు, ల్యాబ్లు, టాటా టెక్నాలజీస్ సహకారంతో యువతకు నైపుణ్యంతో కూడిన శిక్షణను అందించనున్నట్లు తెలిపారు. పలురకాల మెషనరీపై రియల్ టైం ప్రాక్టికల్ ట్రైనింగ్, ఇంతకుముందు ఎప్పుడూ లేనటువంటి అత్యాధునిక పరికరాలతో శిక్షణ ఉంటుందని అన్నారు. ఉద్యోగాలకు లేదా సొంత వ్యాపారం చేసుకోవడానికి వీలుగా రూపొందించిన పలు కోర్సులు, ఇండస్ట్రీ అవసరాలకు తగిన విధంగా డిజైన్ చేసిన పూర్తిస్థాయి శిక్షణ అందిస్తామని వివరించారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఏటీసీ. కోర్సులు పొందేందుకు అరు లని అన్నారు. ఈకోర్సులతో మల్టీనేషనల్ కంపెనీలలో ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. టాటా కన్సల్టెంట్స్ వారితో సమన్వయం చేసుకొని ఈ కోర్సులను డిజైన్ చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.


పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్


కేఎంసీ కార్యాలయంలో నివాళులర్పించిన మేయర్ నీరజ

జయశంకర్‌కు ఘన నివాళి

ఖమ్మంకార్పొరేషన్,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): :ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన జయశంకర్ జయంతి కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. 16వ డివిజన్‌లోని కొత్తూరు సర్కిల్‌లో జయశంకర్ విగ్రహం వద్ద 19వ డివిజన్ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ, తుమ్మా అప్పిరెడ్డి, అమర్లపూడి బాలశౌరి, ప్రకాశ్, పాశం బ్రహ్మారెడ్డి, గుండేపోగు బాబురావు నివాళులు అర్పించారు.


జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న తుమ్మా అప్పిరెడ్డి

తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో..

ఖమ్మంచర్చికాంపౌండ్: జయశంకర్ జయతి వేడుకలను తెలంగాణ ఉద్యమకారుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఖమ్మంనగరంలోని అమరవీరుల స్థూపం వద్ద జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్రస్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు, ఉమ్మడి ఖమ్మంజిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య, డోకుపర్తి సుబ్బారావు,పగడల నరేందర్, బచ్చల పద్మాచారి, లింగనబోయిన సతీష్ పాల్గొన్నారు.


జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

ఖమ్మం మార్కెట్: తెలంగాణ సాధకుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను బుధవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు భారీగా పాల్గొని జయశంకర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. తెలంగాణ తొలి, మలిఉద్యమాలలో ఆయన చేసిన పోరాట పటిమను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్లు వలరాజు, కర్నాటి క్రిష్ణ, నాయకులు తిరుమలరావు, తాజుద్దీన్, ఎర్రా అప్పారావు, షకీన తదితరులు ఉన్నారు.


నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

వ్యవసాయ మోటార్ల దొంగల అరెస్ట్

కూసుమంచి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ బావుల, బోర్ల వద్ద మోటార్లను అపహరిస్తున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. కూసుమంచి ఎస్ఐ నాగరాజు కథనం ప్రకారం.. శివాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు మోటార్ సైకిళ్లపై పారిపోయేందుకు ప్రయత్నించారు. అనుమానం వచ్చిన పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. తమదైన శైలిలో విచారించారు. దీంతో వ్యవసాయమోటార్లు, వాహనాల టైర్లు దొంగతనం చేస్తున్నట్లుగా అంగీకరించారు. ఈశ్వరమాధారంలోనూ,హట్యతండ పరిధిలోని పాలేరు పాతకాల్వపై మొత్తం 12 విద్యుత్ మోటార్లు దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వారినుంచి 14కేజీల కాపర్ వైరు, ఏడు కరెంటు మోటార్లు, మూడు టైర్లు,


మోటార్లను,టైర్లను చూపిస్తున్న పోలీసులు

దొంగతనానికి ఉపయోగించిన మూడు మోటార్‌సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. దొంగతనానికి పాల్పడిన పోచారం శివారు వెంకటాపురం గ్రామానికి చెందిన షట్ల నరేష్, యాట రాజు, నిమ్మల రమేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

దేవాలయ భూములకు బోర్డుల ఏర్పాటు

కామేపల్లి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గోవింద్రాలలో ఆంజనేయస్వామి దేవాలయ భూములకు స్వాహా పర్వానికి అడ్డుకట్ట పడింది. చాలా ఏళ్లుగా దేవాలయ భూములు ఆక్రమణకు గురయ్యాయి. కనీసం ఆ భూములకు కౌలు కూడా ఇవ్వకుండా ఆక్రమణదారులు సాగు చేసుకుంటున్నారు. దీనిపై గ్రామస్థులు దేవాదాయశాఖకు పలుమార్లు ఫిర్యాదు చేయగా.. ఇప్పుడు కొలిక్కి వచ్చింది. హైదరాబాద్ దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాలతో ఆ భూములకు బోర్డులను ఏర్పాటు చేశారు. గోవింద్రాల పరిధిలోని సర్వే నెం. 173లో 1-35 కుంటలు, సర్వే నెంబర్ 138లో 9-23కుంటల భూమికి పోలీస్ రెవెన్యూ, దేవాదాయశాఖ ఆధ్వర్యంలో బోర్డును సంయుక్తంగా అధికారులు ఏర్పాటు చేశారు. కారేపల్లి సీఐ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ దేవాలయ ఈఓ వేణుగోపాలచార్యులు, ఆర్ఐ విజయభాస్కర్, తోటకూరి వెంకటేశ్వర్లు, డీ.శ్రీనివాసరావు, మోహన్‌క్రిష్ణ, పి.సాయిలలిత్, కే.సత్యం, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన సదస్సు


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న డీఎస్పీ ఫణిందర్

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాపర్తినగర్‌లోని మైనారిటీ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై సైబర్ క్రైండీఎస్పీ సీహెచ్.ఆర్‌వి ఫణిందర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాపార పెట్టుబడి మోసాలు, క్రిడిట్ కార్డు అనధికార లావాదేవిల మోసాలు, లోన్‌ఫ్రాడ్, డిజిటల్ అరెస్టులు వంటివాటితో భయపెడతారని చెప్పారు. ఓటీపీలు, బ్యాంక్ అకౌంట్‌లు, తదితర విషయాలను ఇతరులకు చెప్పొదని అన్నారు. అనంతరం విద్యార్థులచే సైబర్ సేఫ్టీపై నాటకం ప్రదర్శించారు. పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అఖిల, సైబర్ క్రైం ఎస్ఐ రంజిత్‌కుమార్, ఎస్ఐ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మయ్యకు యుగంధర్ పరామర్శ

కామేపల్లి, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): పింజరమడుగు మాజీఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్యను రాష్ట్రయువజన కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ పరామర్శించారు. ఇటీవల లక్ష్మయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ప్రమాదం జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.



భక్తిశ్రద్ధలతో 'సిందూర్'

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జలాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో సామాజిక సమరసత, దుర్గావాహిని మహిళాశక్తి పర్యవేక్షణలో సిందూర్ కుంకుమార్చన నిర్వహించారు. సరస్వతీదేవి మూలనక్షత్రం సందర్భంగా ఈ కార్యక్రమం హిశ్వహిందూ పరిషత్ మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమణి తెలిపారు. కంచిపీఠం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన లక్ష్మీకాసులను భక్తులకు ఉచితంగా అందించటంతోపాటు పూజాసామగ్రిని అందించామని తెలిపారు. సుమారు 1300 వందల మంది మహిళాభక్తులు కుంకుమ పూజలో పాల్గొన్నారని తెలిపారు. ఏటా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రావణమాసంలో కుంకుమ పూజలు,వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా జలాంజనేయస్వామి ఆలయంలో నిర్వహించామని తెలిపారు.





ఉపాధి పనుల్లో అక్రమాలు

నేలకొండపల్లిలో సామాజిక తనిఖీలో వెలుగులోకి..

నేలకొండపల్లి, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల్లో పలు అక్రమాలు వెలుగు చూశాయి. 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను బుధవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ హాల్లో నిర్వహించారు. తనిఖీ ప్రారంభమైనప్పటి నుంచీ గంగరగోళం మొదలైంది. అధికార పార్టీ నాయకులే ప్రతిపక్షపాత్ర పోషించటం విశేషం. సామాజిక తనిఖీలో కొన్ని విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. లెక్కల్లో చూపిన వాటి కంటే చాలా తక్కువ మొత్తంలో మొక్కలు నాటి డబ్బులు మింగేశారు. వేసిన మొక్కలు పూర్తిస్థాయిలో బతకలేదు. అదేమంటే నాటిన మొక్కలను గేదెలు తినేసాయన్న సమాధానం వచ్చింది. దీంతో నివ్వెర పోవటం అధికారుల వంతైంది. అంతేగాకుండా మొక్కలకు వేయాల్సిన కంచె వేయకుండానే వేసినట్లుగా బిల్లులు డ్రా చేశారు. అసలు మొక్కలు నాటకుండానే గుంతలు తీసినట్లుగా కూడా రికార్డు చేశారు. ఉపాధి హామీ కింద చేసిన ప్రతి పని వద్ద చేసిన పని వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉండగా, బోర్డులు ఏర్పాటు చేయకుండానే బోర్డులు ఏర్పాటు చేసినట్లుగా చూపించారు. కూలీలకు వేసే మస్టర్లను సైతం దిద్దారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. మొత్తం 32 గ్రామ పంచాయతీలకు సాయంత్రంకు కేవలం ఏడు పంచాయతీలకు సంబంధించి మాత్రమే తనిఖీ పూర్తిచేయగా, మరికొన్ని పంచాయతీల తనిఖీ రాత్రి వరకు పూర్తి చేసే అవకాశం ఉంది. సామాజిక తనిఖీ గురువారం కూడా కొనసాగనున్నది. అడిషనల్‌పీడీ, డీఆర్డీఏ శిరీష, ఏపీడీ శ్రీదేవి, అంబుడ్స్‌మెన్ రమేష్, డీవీఓ సక్రియా, క్వాలిటీ కంట్రోల్ అధికారి వీరయ్య, ఎంపీడీఓ మర్రి ఎర్రయ్య, ఏపీఓ సునీత పాల్గొన్నారు.

ఏఎంవోగా రాజశేఖర్, సీఎంవోగా ప్రవీణ్‌కుమార్

ఖమ్మంఖానాపురం హవేలి,ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లావిద్యాశాఖ కార్యాలయంలో ఏఎంవోగా(అకాడమిక్ మానటరింగ్ ఆఫీసర్) వి. రాజశేఖర్‌ను, సీఎంవో (కమ్యూనిటీ మొబిలైజేషన్ అండ్ మీడియా)కోఆర్డినేటర్‌గా బి. ప్రవీణ్‌కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రాజశేఖర్ తుమ్మలపల్లి పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బి.ప్రవీణ్‌కుమార్ చింతకాని మండలం ప్రొద్దుటూరు ఉన్నత పాఠశాల స్కూల్ అసిసెంటంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో సీఎంవోగా విధులు నిర్వహించిన రాజశేఖర్‌ను విధుల నుంచి తొలిగించి స్కూల్‌అసిస్టెంట్‌గా కొదుమూరు ఉన్నత పాఠశాలకు స్కూల్‌అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. గతంలో ఎఎంవోగా విధులు నిర్వహించిన రవికుమార్ తన విధులను వదులుకోని పుట్టకోట ఉన్నత పాఠశాల ప్రదానోపాధ్యాయుడుగా తిరిగి వెళ్లారు. దీంతో రెండు పోస్టులు ఖాళీగా ఉండటంతో కలెక్టర్ వాటిని బుధవారం భర్తీ చేశారు. ఏఎంవోగా మరో వ్యక్తి శ్రీనివాసరావు ప్రయత్నించగా కలెక్టర్ తిరస్కరించారని తెలిసింది. విద్యాశాఖ పనితీరు పై అదనపు కలెక్టర్ శ్రీజ ప్రత్యేక దృష్టి పెట్టి కొందరు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

బీసీలను కాంగ్రెస్ మోసం చేస్తోంది

బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు

ఖమ్మంబైపాస్‌రోడ్, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలను, బీసీలను కాంగ్రెస్ రిజర్వేషన్ల పేరిట మోసం చేస్తోందని, ఢిల్లీలోని జంతర్‌మంతర్‌వద్ద ఒక మోసపూరిత ధర్నా నిర్వహిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు అన్నారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీలో నిర్వహిస్తున్న ధర్నా ఎట్టి పరిస్థితుల్లోను బీసీల హక్కుల కోసం కాదని, మరొకరికి రిజర్వేషన్ కలిపించే ప్రయత్నం కోసం అలా చేస్తున్నారన్నారు. బీసీలకు 5శాతం, ముస్లింలకు పక్కాగా 20శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్న కాంగ్రెస్ విధానం రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. బీసీలపై ప్రేమ ఉంటే కాంగ్రెస్‌కు ఒక్క బీసీని సీఎంను చేసిన దాఖలాలున్నాయా అని ప్రశ్నించారు. ఈసమావేశంలో బీజేపీ నాయకులు ఈవీ రమేష్, నల్లగట్టు ప్రవీణ్‌కుమార్, అల్లిక అంజయ్య, కుమిలి శ్రీనివాసరావు, పమ్మి అనిత, రవీందర్ పాల్గొన్నారు.

చోరీ కేసులో అరెస్టు

తిరుమలాయపాలెం, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన పగిళ్ల రామకృష్ణ ఇంటిలో ఇటీవల దొంగతనం జరిగింది. బంగారు, వెండి వస్తువులు సుమారు రూ.లక్ష విలువైనవి చోరీకి గురయ్యాయి.దొంగతనానికి పాల్పడిన డోర్నకల్ మండలానికి చెందిన కళ్యాణిని విచారణ జరపగా నేరం ఒప్పుకుంది. దీంతో ఆమె వద్ద నుంచి వస్తువులు రికవరీ చేశారు. కోర్టుకు రిమాండ్ చేసినట్టు ఎస్ఐ కూసుపుడి జగదీష్ తెలిపారు.

ఉత్సాహంగా రాజీవ్ మెమోరియల్ క్రికెట్ పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్ ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): నగరంలో ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ మెమోరియల్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. పోటీల రెండోరోజు కాంగ్రెస్ యువ నాయకుడు తుమ్మల యుగంధర్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులు గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో క్రీడలు ఆడాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు, బాణాల లక్ష్మయ్య, మిక్కిలినేని నరేందర్, మతిన్ ఉన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న తుమ్మల యుగంధర్

కరాటేలో రెజోనెన్స్ శ్రీనగర్ విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంస్పోర్ట్స్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలో జరిగిన సౌత్ ఇండియా స్థాయి కరాటే పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు సాధించారని పాఠశాల డైరెక్టర్స్ కొండా శ్రీధర్ రావు, కృష్ణవేణి తెలిపారు. ఉబైద్, దీక్షిత, పృథ్వీరాజ్ ప్రథమ స్థానం సాధించగా రిహాన్ ద్వితీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో వారిని అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల

డాక్టర్ పోస్టులకు ఇంటర్వ్యూల పూర్తి

నేడు వెబ్‌సైట్‌లో.. తుది జాబితా

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల్లో ఖాళీగాఉన్న 17వైద్యపోస్టులను భర్తీ చేసేందుకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపిక కమిటీ సభ్యులు డీఆర్వో పద్మశ్రీ, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, కలెక్టరేట్ ఏవో కారుమంచి శ్రీనివాసరావు, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ఎంపిక చేసిన తుది జాబితాను గురువారం వెబ్‌సైట్‌తో పాటు నోటీసుబోర్డులో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. గైనకాలజీ6 పోస్టులకు ఇద్దరు, అనస్తీషియా2 పోస్టులకు1, ఆప్తాల్మజీ2 పోస్టులకు ఇద్దరు. ఈఎన్టీ ఒకటికి ఒకరు, జనరల్ మెడిసిన్ 1 పోస్టుకు ఇద్దరు, జనరల్ సర్జన్ 2పోస్టులకు ఒకరు, పిడియాట్రిక్స్ ఒకటికి ఒకరు, డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టు ఒకటికి 9మంది, పల్మనాలజీ ఒక పోస్టుకు ఒకరు చొప్పున ఇంటర్వ్యూకు హాజరైనట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు.

స్మార్ట్ కిడ్జ్ జ్యూట్ బ్యాగులను ఆవిష్కరించిన కలెక్టర్

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యంలో రూపొందించిన జ్యూట్ బ్యాగులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఆవిష్కరించారు. నూతన కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను పాఠశాల కరస్పాండెంట్ చింతనపు కృష్ణ చైతన్య కలిశారు. ఐదు సంవత్సరాలుగా స్మార్ట్ కిడ్జ్ పాఠశాల ఆధ్వర్యంలో ఏటా జ్యూట్ బ్యాగులను తయారు చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు, ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు.. దీంట్లో భాగంగా ఈసంవత్సరం కూడా ప్రత్యేకంగా జ్యూట్ బ్యాగులను పాఠశాల ఆధ్వర్యంలో తయారు చేయించి కలెక్టర్‌తో ఆవిష్కరించారు. ప్రతీ ఒక్కరు పర్యావరణాన్ని పరిరక్షించడానికి జ్యూట్ బ్యాగులను ఉపయోగించాలని పిలుపునిచ్చారు.


బ్యాగులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అథ్లెట్లను అభినందించిన కలెక్టర్ అనుదీప్

ఖమ్మంస్పోర్ట్స్, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): ఈనెల 3,4 తేదీల్లో హన్మకొండలోలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను బుధవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అభినందించారు. పోటీల్లో అథ్లెటిక్స్ అకాడమీ క్రీడాకారులతో పాటు జిల్లాక్రీడాకారులు 23 బంగారు, 11రజత, 11కాంస్యపతకాలు మొత్తం 45 పతకాలు సాధించడంతో పాటు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సైతం సాధించారు. భవిష్యత్ పోటీల్లో రాణించి జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఒలంపిక్ పోటీలలో పాల్గొనే విధంగా శ్రమించాలని అన్నారు. అనంతరం క్రీడాకారులను తీర్చిదిద్దిన అథ్లెటిక్స్ కోచ్‌గౌస్‌ను సన్మానించారు.కార్యక్రమంలో డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, అథ్లెటిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు మందుల వెంకటేశ్వర్లు, కార్యదర్శి షఫీక్ అహ్మద్, ఎన్. వెంకటేశ్వర్లు ఉన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్

ఉపాధి కూలీలకు సరైన వేతనాలు ఇవ్వాలి

తిరుమలాయపాలెం,ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు కనీస వేతనం ఇవ్వాలని పనులతో సంబంధం లేకుండా రోజుకు రూ.800ఇవ్వాలని ఏఐపీ కేఎంఎస్ జిల్లా కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు కోరారు. బుధవారం మండలంలోని బచ్చోడులో ఆ సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఇందిరమ్మ ఆత్మీయభరోసా రూ.12వేలు విడుదల చేయలేదని, ఉపాధి కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. 20నెలలు అవుతన్నా హామీలు అమలు చేయడం లేదన్నారు. ఉపాధికూలీలకు సరైన వేతనాలు ఇవ్వాలని కోరుతూ ఆగస్టు నుంచి పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్టు, సెప్టెంబరులో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్టు తెలిపారు. సెప్టెంబరు 10న చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు.

నెంబరు ప్లేటు లేని బైక్‌లు సీజ్



పట్టుబడిన నెంబరు ప్లేటులేని బైక్‌లు

తల్లాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లాడలో బుధవారం పోలీసులు వాహనాల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీలలో నెంబరు ప్లేట్‌లేని 51 బైక్‌లను గుర్తించి సీజ్ చేశారు. సంబంధిత బైక్ యజమానులపై కేసులు నమోదుచేశారు. నెంబరు ప్లేటు లేకుండా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ వెంకటకృష్ణ అన్నారు. ఏఎస్ఐ బి.వెంకటేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద బీసీల ధర్నాలో వైరా ఎమ్మెల్యే



సీఎం, మంత్రుల ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే

వైరా, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలనే డిమాండ్‌తో బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పాల్గొన్నారు. సీఎం, డిప్యూటీ సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మంత్రులు, తేటి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులతో కలిసి రాందాస్‌నాయక్ ధర్నాలో పాల్గొన్నారు.

గణపతి ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా వందనపు



సత్తుపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): 16వ వాసవీ గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా వందనపు సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక శ్రీ కోదండ రామాలయం ఆవరణలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 27వ తేదీ నుంచి వచ్చేనెల 6వ తేదీ వరకు శ్రీ కోదండ రామాలయం ఆవరణలోని వర్తక సంఘం ప్రాంగణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను పూర్తి ఆధ్యాత్మికంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సత్తుపల్లి మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘాలు, వాసవీక్లబ్ సత్తుపల్లి గ్రేటర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ ఉత్సవాలకు ఈ నెల 17న ఉదయం భూమిపూజ చేయనున్నామని, భక్తులు వేలాదిగా తరలిరావాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల శాతం

ఏన్కూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో బడిబాట కార్యక్రమం నిర్వహించడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పెరిగింది. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను వివరించడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది ఎక్కువ మంది విద్యార్థులు చేరారు. ప్రభుత్వం కల్పించే మధ్యాహ్న భోజనం, యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, స్కాలర్‌షిప్ వంటి సౌకర్యాలతోపాటు క్వాలీఫైడ్ టీచర్లు ద్వారా విద్యాబోధన జరుగుతుందని వివరించడంతో ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థుల తల్లిదండ్రులు మొగ్గుచూపుతున్నారు. ఈఏడాది బద్రుతండాలో 33, తిమ్మారావుపేట53, ఏన్కూరు బాలికల ఉన్నత పాఠశాలలో 40, గంగులనాచారం48, ఏన్కూరు హరిజనవాడ 49, హిమాంనగర్ 32, రాజులపాలెం 14, కోదండరాంపురం తండాలో 12 మంది విద్యార్థులు కొత్తగా నమోదయ్యారు. బడిబాట కార్యక్రమంలో విద్యార్థులు ఎక్కువగా నమోదయినట్టు ఎంఈవో రహీంబీ చెప్పారు. విద్యార్థులకుసకాలంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, అందించడం జరిగిందని అన్నారు. రాజులపాలెం, కొత్తమేడేపల్లి మూతపడిన పాఠశాలలను పునఃప్రారంభించడం జరిగిందన్నారు.

నారాయణపురంలో వనమహోత్సవం



వనమహోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

తల్లాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం లూర్ధుమాత హైస్కూల్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వనమహోత్సవ ప్రాధాన్యత, పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన కలిగించారు. పాఠశాల విద్యార్థులు చెట్లను నరకడం వల్ల వచ్చే నష్టాలను నాటికలు, నృత్యరూపాల్లో ప్రదర్శించి ప్రేక్షకులను ఆలోచింపచేశారు. విద్యార్థులు వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు నాటారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కోడూరు నాగేశ్వరరావు, నిర్వాహకులు కర్నాటి లక్ష్మారెడ్డి, బెల్లంకొండ ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, వెంకటరెడ్డి, కరస్పాండెంట్ సిస్టర్ సత్య, హెచ్ఎం సిస్టర్ ప్రసన్న పాల్గొన్నారు.

వీయంబంజర్‌లో కార్గో సేవలు పునః ప్రారంభం

పెనుబల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వి.యం.బంజర్ ఆర్‌టీసీ బస్టాండ్‌లో బుధవారం కార్గో సేవలను లాజిస్టిక్ ఏటీఎం వెంకటనారాయణ బుధవారం పునఃప్రారంభించారు. గత కొంత కాలంగా వి.యం.బంజర్ బస్టాండ్‌లో కార్గో సేవలు నిలిచిపోయాయి. దీంతో మండల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పునఃప్రారంభంతో పెనుబల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్‌కె మునీర్‌పాషా, కార్గో ఏజెంట్ పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



గర్భిణీలకు సీమంతాలు చేస్తున్న దృశ్యం

కల్లూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలకు సీమంతాలు చేశారు. తల్లి పాల ప్రాముఖ్యత గురించి సీడీపీవో నిర్మలజ్యోతి అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించడం వల్ల బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో కల్లూరు ఏసీడీపీవో రత్తమ్మ, పేరువంచ, చంద్రుపట్ల, చెన్నూరు సెక్టార్ల సూపర్వైజర్లు భవానీ, సుజాత, వెంకటమ్మ, అంగన్‌వాడీ టీచర్లు ప్రభావతి, భారతి, హెలెన్, భవాని ఆశాలు ఉపాధ్యాయులు, తల్లులు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

కనీస వసతుల్లేని బాలుర వసతి గృహం

» సమస్యల వలయంలో వీఎంబంజర్ బాలుర హాస్టల్ భవనం



శిథిలావస్థకు చేరిన వసతి గృహ భవనం



కూలిపోయినప్రహరీ, డోర్లు లేని మరుగుదొడ్లు



ఆరుబయటే స్నానాలు చేస్తున్న విద్యార్థులు

పెనుబల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వీఎంబంజర్‌లో వెనుకబడిన తరగతుల వసతి గృహంలో కనీస వసతుల లేమితో విద్యార్థులు దిన దిన గండంలా ఉంటున్నారు. సుమారు 40మంది విద్యార్థులున్న వసతి గృహ భవనం సుమారు 30ఏళ్ల క్రితం నిర్మించారు. భవనంలో రెండు గదులు మినహా మిగిలిన గదులన్నీ శిథిలావస్థకు చేరాయి. ఈ భవనంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

వసతి గృహంలో సమస్యలు

విద్యార్థులకు వంట చేసేందుకు షెడ్ శిథిలావస్థకు చేరుకుంది. విద్యార్థులు స్నానాలు చేసేందుకు కనీసం డోర్లు లేకపోవడంతో ఆరుబయటే స్నానాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒకవైపు ప్రహరీగోడ కూలిపోగా ఆ భవనానికి మరోవైపు అసలు ప్రహరీగోడను నిర్మించలేదు. విషసర్పాలు వస్తాయేమోనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో గదుల్లోకి నీరు వచ్చి చేరి పుస్తకాలు, దుస్తులు తడిసిపోతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన భవన నిర్మాణానికి శాఖాపరంగా మంజూరైనప్పటికీ నిధులు మాత్రం కేటాయించకపోవడంతో భవన నిర్మాణం చేపట్టలేదు. దీంతో పక్కనే ఉన్న పాఠశాల భవనంలోని కొన్ని గదుల్లో విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

రుణాలపై డ్వాక్రా మహిళల ధర్నా

బోనకల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందాపురం(ఎ) గ్రామానికి చెందిన డ్వాక్రా గ్రూపు మహిళలు బుధవారం తమకు ఇచ్చిన రుణాలకు సంబంధించి అవకతవకలు జరిగాయని, బాధ్యుల పైన చర్యలు తీసుకోవాలని స్థానిక ఐకేపీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు ఇచ్చిన రుణాలను నెలవారీ కడుతున్నా పరిమితికి మించి ఎక్కువ నెలలు కట్టాలని గ్రామదీపిక, ఐకేపీ సీసీలు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము తీసుకున్న రుణాలను మాత్రమే పుస్తకాలల్లో రాయాల్సి ఉండగా, ఎక్కువ రాస్తున్నారని వాపోయారు. ఈ విషయంపై ఏపీఎం వెంకటేశ్వర్లు, సీసీ ఝాన్సీలను వివరణ కోరగా నిబంధనల మేరకే రుణాల పంపిణీ, వసూళ్లు జరుగుతున్నాయని, అన్ని బ్యాంకు ఖాతాల ద్వారానే లావాదేవీలు నడుస్తున్నాయని తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి విచారణ జరిపి అవకతవకలుంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

బోనకల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పొదిలి వెంకన్న సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ అధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. సైబర్ నేరాల గురించి బాధితులు 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు. ప్రిన్సిపాల్ నళినిశ్రీ, అధ్యాపకులు తిరుపతిరావు, ప్రేమ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

మధిర రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మధిర టౌన్ ఎస్ఐ కిషోర్ కుమార్ సూచించారు. బుధవారం స్థానిక శ్రీనిధి కాలేజీలో సైబర్ నేరాలపై పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సోషల్‌మీడియా, వాట్సప్, ఫేస్‌బుక్‌లో వచ్చే అనవసరమైన లింకులపై క్లిక్ చేయవద్దని ఆయన సూచించారు.

ఏన్కూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎస్ఐ మహ్మద్ ఉఫాతుల్ రఫి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అపరచిత వ్యక్తుల కాల్స్, ఈమెయిల్స్, వాట్సాప్ లింక్స్, బ్యాంకు అకౌంట్ మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే వాట్సప్ చాట్స్, మెసేజెస్ ఓపెన్ చేయకుండా ఉండాలని కోరారు. విద్యార్థులు లక్ష్యసాధనకోసం నిరంరతం శ్రమించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. పాఠశాల హెచ్ఎం రాఘవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అండర్-14 క్రికెట్ పోటీలకు రమేష్ హైస్కూల్ విద్యార్థులు

పెనుబల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెంలో జరిగిన రాజీవ్‌గాంధీ మెమోరియల్ అండర్-14 క్రికెట్ టోర్నమెంట్‌కు పెనుబల్లి రమేష్ హైస్కూల్ 15మంది విద్యార్థులు బుధవారం తరలివెళ్లారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ కె.రమేష్, కరస్పాండెంట్ లలితభవాని, టీం కోచ్ మారుతీ శ్రీను పాల్గొన్నారు.

వైరాలో డివైడర్లకు రంగులు

వైరా, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వైరాలోని జాతీయ ప్రధాన రహదారిలో ఉన్న డివైడర్లకు బుధవారం రంగులు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక శాంతినగర్ నుంచి ఐఎంఎల్ డిపో వరకు దాదాపు రెండు కిలో మీటర్ల దూరం జాతీయ ప్రధాన రహదారిలో ఈ డివైడర్లు ఉన్నాయి. వాహనాల టైర్ల వెంట లేచిపడిన బురదతో డివైడర్లు పూర్తిగా మట్టితో నిండిపోయాయి. దాంతో ఈ డివైడర్లకు రంగులు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. కమిషనర్ చింతా వేణు పరిశీలించారు.

టేకులపల్లి ఆదర్శ పాఠశాలలో స్క్రాప్ వేలం

పెనుబల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): టేకులపల్లి ఆదర్శ పాఠశాలలో స్క్రాప్ వేలంపాటను గురువారం నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రూపస్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న వస్తువులకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యక్తులు ఈ వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

'స్థానికం'లో టీడీపీ క్రియాశీలక పాత్ర

చింతకాని, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో టీడీపీ క్రియాశీలక పాత్ర పోషించాలని టీడీపీ పార్లమెంటరీ అడహక్ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం సూచించారు. స్థానిక మండల టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఆ పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ బలంగా ఉన్న చోట అభ్యర్థులను బరిలో దింపాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా నాయకులు కేతినేని హరీష్ చంద్ర, మందడపు సుదాకర్, మండల అధ్యక్షుడు తేలుకుంట శ్రీనివాసరావు, రావట్ల సత్యనారాయణ, నన్నక రామారావు, మల్లెల సత్యనారాయణ, గోపాలరావు, తాజుద్దీన్ పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయాలి

మధిర రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణంగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందునాయక్ సిబ్బందికి సూచించారు. దెందుకూరు పీహెచ్‌సీ పరిధిలోని మధిర-2 సబ్‌సెంటర్ నందు ప్రతి బుధవారం నిర్వహించే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అప్పుడే పుట్టిన బిడ్డ మొదలుకొని ఐదు సంవత్సరాల్లోపు పిల్లలకు, గర్భిణీ మహిళలకు సంపూర్ణంగా డోస్‌ల వారీగా పూర్తిచేసి మాతా శిశు సంరక్షణ కార్డులో నింపాలని ఆయన అన్నారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ పృథ్వీరాజ్‌నాయక్, రామ్మోహన్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి



ఆహారాన్ని పరిశీలిస్తున్న మట్టా దయానంద్

పెనుబల్లి, ఆగస్టు 06 (ఆంధ్రజ్యోతి): తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం చదువు అందించాలని ఉద్దేశ్యంతో డైట్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో పెంచడం జరిగిందని కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కుప్పెనకుంట్లలో ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే వెనుకబడిన తరగతులు బాలికల వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని వంట శాలను, కూరగాయలను పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వసతిగృహంలో వంటగదిని తప్పని సరిగా పరిశుభ్రంగా ఉంచాలని నాణ్యమైన కూరగాయల, సరుకులను వాడాలన్నారు. పార్టీ మండల అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పసుమర్తి విశ్వనాద్, కల్లూరు ఎ ఎం సి వైస్ ఛైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కేసర శ్రీనివాసరెడ్డి, సోమరాజు సీతారామారావు, వణుకూరి భద్రారెడ్డి, కిరణ్‌కుమార్, హాస్టల్ ప్రిన్సిపాల్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతిమసంస్కారాలకు ఆర్థికసాయం

వైరా, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వైరాలో గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతిచెందిన కేశా కార్తీక్ అంతిమసంస్కారాల నిమిత్తం మండల ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో రూ.6వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దహన సంస్కారాల కోసం కార్తీక్ భౌతిక కాయాన్ని అన్నం ఫౌండేషన్‌కు అప్పగించి అవసరమైన ఆర్థిక సహాయాన్ని కూడా సమకూర్చారు. కార్తీక్ మృతదేహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు వనమా విశ్వేశ్వరరావు, మిట్టపల్లి కిరణ్ కుమార్, కొత్తూరు వెంకటరమణ, యండ్రపూడి శివశంకర్, ఇమ్మడిశెట్టి కృష్ణారావు, సందీప్, లక్ష్మయ్య నివాళులర్పించారు.

సదస్సును జయప్రదం చేయండి

తల్లాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వికలాంగులు, వితంతువులు, వృద్ధుల ఆసరా పింఛన్ల పెంపుకోసం ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 9న సత్తుపల్లిలో జరగనున్న సన్నాహక సదస్సును జయప్రదం చేయాలని తల్లాడ మండల కమిటీ అధ్యక్షుడు ఎక్కిరాల నాగేశ్వరరావు మాదిగ కోరారు. బుధవారం మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు బలరాం, వీరయ్య, కృష్ణ, దేవసహాయం, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

బెల్టులు, నోట్‌బుక్స్ పంపిణీ

వైరా, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ రెండోవార్డు హనుమాన్‌బజార్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 42మంది విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం బెల్టులు, టైలు, నోట్‌పుస్తకాలు, దుస్తులను పంపిణీ చేశారు. హనుమాన్ బజార్‌కు చెందిన తిరుపతి శ్రీనివాసరావు ఈ పాఠశాలలోని 2,3తరగతుల విద్యార్థులను దత్తత తీసుకుని వీటిని అందజేశారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకులు వై.బుచ్చిరామారావు, చెరుకూరి శ్రీనివాసరావు, గద్దే నీరజ, చింతలపూడి వెంకటేశ్వరరావు, దాతలు చింతోజు నాగేశ్వరరావు, వాసుదేవశాస్త్రీ, ప్రధానోపాధ్యాయుడు టి.హన్మంతరావు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన కార్మికుల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో కార్మికులు

కల్లూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలో పాల్గొనేందుకు ఖమ్మం కలెక్టరేట్‌కు తరలి వెళుతున్న మధ్యాహ్న భోజన కార్మికులను అడ్డుకొని కల్లూరు పోలీసులు బుధవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. గత సంవత్సరం నవంబరు నుంచి తమకు రావాల్సిన బిల్లులు, వేతనాలు, పెండింగ్ బకాయిల కోసం ఆందోళన చేపట్టేందుకు కల్లూరు నుంచి ఉదయం 7 గంటల సమయంలో బయలుదేరి వెళుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు ఆరుగురు మధ్యాహ్న భోజన మహిళ కార్మికులకు అడ్డుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ హరిత తెలిపారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఖమ్మ కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టేందుకు వెళుతుండగా అక్రమంగా పోలీసులు అరెస్ట్ చేయటం పట్ల సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు వేము రాంబాబు, దయాకర్‌లు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. పెండింగ్ వేతనాలు, బిల్లులు నెలల తరబడి రాక మధ్యాహ్న భోజన కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల హామీ ప్రకారం నెలకు రూ. 10 వేతన హామీని అమలు పరచాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేలా ఆందోళన చేపట్టగా పోలీసులు కార్మిలకును అడ్డుకోవటం తగదన్నారు. మధాహ్న భోజన కార్మికులు పాగ సత్యవతి, పరిగడుపు సుశీల, అలివేలు, మారేమ్మ, నాగేంద్ర పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన సదస్సు

పెనుబల్లి, ఆగస్టు 06 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వల్ల రైతులకు నగదు ఆదాతోపాటు సమయం కలిసి వస్తుందని పెనుబల్లి మండల వ్యవసాయ అధికారి ప్రసాదరాజు తెలిపారు. ఆయన బుధవారం మండల పరిధిలోని గణేష్‌పాడులో నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. నానో యూరియా పోషక సామర్థ్యం 90 శాతం ఉంటుందని సాధారణ యూరియాలో కేవలం 30 శాతం మాత్రమే పోషక సామర్థ్యాలు ఉంటాయని ఆయన అన్నారు. సూక్ష్మపోషకాలు అయిన కాల్షియం ఐరన్, జింక్, మాంగనీస్ లను మొక్కలకు అందిస్తుందని తెలిపారు. గణేష్‌పాడులో ఆయన రైతుల వరి క్షేత్రాలను పరిశీలించారు. ఎ.ఇ.ఓ హర్షనందిని, సమంత, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టం కోసం ఐక్య పోరాటం

ఎర్రుపాలెం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బలోపతం చేసే విధంగా వ్యవసాయ కూలీలు ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు సత్యనారాయణకోరారు. మంల కేంద్రంలోని రామిశెట్టి పుల్లయ్య భవనంలో వ్యవసాకార్మిక సంఘం నాలుగో మండల మహాసభను బుధవారం నిర్వహించారు. రోజువారి కనీస కూలీ రూ.600లు చెల్లించాలనిప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పనిదినాలు 200లకు పెంచాలన్నారు. వ్యకాసం రాష్ట్ర కమిటీసభ్యులు ఎర్ర శ్రీనివాసరావు జిల్లా ఉపాధ్యక్షుడు తేలప్రోలు రాధాకృష్ణ, రైతుసంఘం జిల్లా కమిటీసభ్యుడు దివ్వెల వీరయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు గామాసుజోగయ్య,నాగులవంచ వెంకటరామయ్య,నాయకులు గొల్లపుడి పెద్దకోటేశ్వరరావు హనుమంతరావు, యువజన సంఘం నాయకులు ప్రభాకరావు, సంధ్యారావు, గౌర్రాజురాములు పాల్గొన్నారు.

రోడ్డుకు ఇరువైపుల మొక్కలు నాటించాలి

కారేపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆర్‌అండ్‌బి రోడ్డుకు ఇరువైపుల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది మొక్కలు నాటించాలని ఎంపీడీవో మల్లెల రవీంద్రప్రసాద్, ఏపీవో కోటేశ్వరరావులు కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీలలో స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

జయశంకర్ సార్‌కు ఘన నివాళి



మధిర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిద్ధాంత కర్త జయశంకర్ జయంతిని బుధవారం మధిరలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ సంపత్ కుమార్, విద్యుత్ ఏడిఏ కార్యాలయంలో ఏడిఏ అనురాధ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ రవీందర్ రెడ్డి, బిఆర్ఎస్ కార్యాయంలో జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ కమల్‌రాజు జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జయశంకర్ పాత్రను గుర్తు చేసుకున్నారు.

సత్తుపల్లిరూరల్ " తెలంగాణ పిత జయశంకర్ జయంతి సందర్భంగా బుధవారం స్థానిక పాతసెంటర్‌లోని హైస్కూల్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధిర రూరల్ " స్వరాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను బుధవారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించి ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు అరిగె శ్రీనివాసరావు, వైవీ.అప్పారావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, ధీరావత్ మాధవి, ముత్తవరపు ప్యారీ, పరిశ శ్రీనివాసరావు, నాగులవంచ రామారావు పాల్గొన్నారు.

పెనుబలి " తెలంగాణా మలిదశ ఉద్యమ రథసారధి జయశంకర్ 91వ జయంతి వేడుకలు పెనుబల్లిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు వి.వి. రామారావు, వంగా రామారావు, కొప్పుల శ్రీనివాసరావు, హాతీరాం పాల్గొన్నారు.

బోనకల్ " ఖమ్మం బస్టాండ్ సెంటర్లో బుధవారం జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన తెలంగాణ కోసం నిస్వార్థంగా పోరడారని కమల్‌రాజ్ గుర్తు చేశారు. బీఆర్ఎస్ నాయకులు బాణోతు కొండ, బందం నాగేశ్వరరావు, పారా ప్రసాద్, వెంకటేశ్వర్లు, రవీంద్ర పాల్గొన్నారు.

వైరా " వైరాలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ చింతా వేణు ఆయనకు ఘన నివాళులర్పించారు.

అభివృద్ధిలో వైరా వెనకబాటు

వైరా, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీగా ఏర్పడి ఏడు సంవత్సరాలు దాటినా అభివృద్ధికి ఆమదదూరంలో ఉందని మాజీ ఎంపీపీ బొంతు సమత విమర్శించారు. బుధవారం వైరాలోని సుందరయ్యనగర్‌లో జరిగిన సీపీఎం సమావేశంలో ఆమె మాట్లాడారు. ఖాళీ స్థలాల్లో చెట్లు పెరిగి అడవిని తలపిస్తున్నాయని వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు నాగూల్‌పాషా, కురుగుంట్ల శ్రీనివాసరావు, షేక్.జమాల్, మల్లెంపాటి ప్రసాద్, నారికొండ అమరేంద్ర, వడ్లమూడి మధు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా గోపి

ఏన్కూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా గంగులనాచార ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బానోతు గోపిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ సమావేశం బుధవారం ఏన్కూరులో బత్తుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. అధ్యక్షుడుగా పనిచేస్తున్న చింతా రాజు బదిలీ కావడంతో కొత్త అధ్యక్షుడుని ఎన్నుకున్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని గోపి హామి ఇచ్చారు. జిల్లా కార్యదర్శి ఎల్.సురేష్, మండల ప్రధాన కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, మహిళ కార్యదర్శి పి.లత, జిల్లా మాజీఅధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, మండల అసోసియేట్ అధ్యక్షుడు కె.కిరణ్, శ్యామల, మాధవ,ఇ మన్మోహన్‌రెడ్డి, చక్రపాణి, వేణు, రాము, కేవీ రాజు, విశ్రాంత ఉపాధ్యాయులు సైదయ్య, రాయల నరసింహారావు తదితరులుపాల్గొన్నారు.

పోటీల్లో న్యూలిటిల్‌ఫ్లవర్ విద్యార్థుల ప్రతిభ

వైరా, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో జరిగిన జాతీయ స్థాయి ఆల్‌స్టైల్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో వైరాలోని న్యూలిటిల్‌ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అద్భుత ప్రదర్శన చూపిన తమ పాఠశాల విద్యార్థులను కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేశ్వరరావు, డైరెక్టర్లు ప్రత్యేకంగా అభినందించారు. ఖమ్మం వర్తకసంఘం భవన్‌లో జరిగిన ఈ పోటీల్లో టి.గౌతమ్, ఏ.అమృత, బి.భానుప్రకాష్, డీయోన్, బి.శ్రావణ్, పి.కీనిత్, పి.సాయిదీక్షిత్, ధీరజ్, ఎం.భవ్యశ్రీ, వి.ప్రణవిదీష్ గోల్డ్‌మెడల్, సీహెచ్. శ్రీకరణ్, కె.మణికంఠ, వి.నవనసీషిత్, ఎన్.జ్యోషిత, వి.పవన్‌రెడ్డి, ఎం.రిథిమా, కె.ఉషశ్రీ, కె.రాహుల్‌రెడ్డి సిల్వర్ మెడల్ ఇంకా కొంత మంది విద్యార్థులు బ్రౌన్ మెడల్స్ సాధించారు.



విద్యార్థులతో కరస్పాండెంట్ భూమేశ్వరరావు, డైరెక్టర్లు